# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి వారి

వేసవి సంచిక : జులై - సెప్టెంబర్ 2021




**Telugu Jyothi**

**July - September 2021**

A Literary Magazine from

**Telugu Fine Arts Society**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

75 వ

## వజ్రోత్సవ వేడుకలు



ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా... ఎవ్వరేమనినా...
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలపరా నీ జాతి నిండు గౌరవము

## ఆత్మీయులందరికీ
# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

*From*

**TFAS Executive Committee**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

## 2021 దీపావళి తెలుగు జ్యోతి ప్రత్యేక సంచిక: పోటీ ప్రకటన



### తెలుగు కథలకీ కవితలకీ చిత్రాలకీ స్వాగతం

**బహుమతులు:** కథలకి $100, $50; కవితలకి $50, $25

**చిత్ర లేఖనం పోటీలకి:** $50, $25 బహుమతులు



ఈ సంవత్సరానికి కొంగ్రొత్త పోటీలు - చిత్ర లేఖనం (18 ఏళ్ళ లోపు యువతీ యువకులకు)

Arts Competition (for youth below 18 years)

రచనలైనా, చిత్ర లేఖనాలైన **September 5, 2021** లోపల tjarticles@tfas.net కి పంపండి.

**పోటీలకి కాకుండా సాధారణ ప్రచురణ కోసం:**

* మీ పిల్లల చేత తెలుగులో కానీ English లో కానీ పసందైన కథలూ కబుర్లూ ఏవైనా వ్రాయించి పంపండి.

**రచనలకి కొన్ని షరాలు:**

- రచనలు Unicode లో కానీ లేఖిని లాంటి utility లో కానీ టైపు చేసి పంపాలి.
- కథలు single space లో ఎనిమిది (8) పేజీలు మించ కూడదు.
- బహుమతి పొందని రచనలని వీలుని బట్టి తెలుగు జ్యోతిలో సాధారణ ప్రచురణకి వాడతాము.
- ఇప్పటి దాకా తెలుగు జ్యోతికి పంపిన రచనలేవీ ఈ సంవత్సరం పోటీలో మళ్ళీ పరిశీలించము.
- చిత్రలేఖనం మీకిష్టమైన తరహాలో (any style) వేయవచ్చు. 8.5 x 11 సైజ్ లేదా 11 x 17 సైజ్ కాగితం/ఆర్ట్ పేపర్ పైనైనా వేసి, డిజిటల్ ఇమేజ్ (high-resolution digital image in png/jpg format) మాకు పంపగలరు.
- మీ రచన/చిత్రంతో పాటు మీ ఊరూ, పేరూ, చిరునామా, email address, మీ పరిచయం, ఇది మీ సొంత రచన/చిత్రం అనీ, మరింకెక్కడా ప్రచురించలేదని మీ ధ్రువీకరణ పంపాలి.
- తెలుగు కళా సమితి (TFAS) కార్య వర్గ సభ్యులూ, తెలుగు జ్యోతి సంపాదక సమితి సభ్యులూ, వారి కుటుంబ సభ్యులూ బహుమతులకి అర్హులు కారు.

### మరిన్ని వివరాలకి సంప్రదించండి


| | | | |
|---|---|---|---|
| ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ | 973 525 5201 | జాగర్లమూడి శ్రీదేవి | 732 470 7055 |
| ఉప్పల సుధాకర్ | 732 491 6503 | పారా అనూరాధ | 201 312 5335 |
| తాడేపల్లి కుమార్ | 732 586 9320 | లంకా కృష్ణా రావు | 973 756 5903 |
| బొగ్గవరపు లవ | 732 668 2935 | తిప్పాభొట్ల రవిశంకర్ | 732 397 9795 |
| తాతా వేంకట సత్య | 973 985 3409 | | |

# తెలుగు కళా సమితి

## Telugu Fine Arts Society



### ఆత్మీయానురాగాలు పంచే
### అమృతమూర్తులైన అమ్మలందరికీ

## మాతృదినోత్సవ శుభాకాంక్షలు

*From*

**TFAS Executive Committee**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A 501(c) not for profit corporation: Tax Id# 22-2534166

P O Box 278, Edison, NJ 08818 http://www.tfas.net



**Board of Trustees 2020-2022**

**President**
Sreedevi Jagarlamudi
(732) 470-7055
president@tfas.net

**Vice-President/ Secretary**
Bindu Yalamanchili
(908) 240-3167
secretary@tfas.net

**Treasurer**
Jyothi Gandi
(732) 208-9599
treasurer@tfas.net

**Cultural**
Anuradha Para
(201)312-5335
events@tfas.net

**IT Services**
Anuradha Dasari
(908) 907-1502
it@tfas.net

**Membership Services**
Srinivas Cheruvu
(732) 447-6686
membership@tfas.net

**Community Services**
Ravi Annadanam
(917) 355-5503
community@tfas.net

**Advisors**
Anand Paluri (Chair)
Sudhaker Rayapudi
Ram Kolluri
Dr. Janani Krishna
Hari Eppanapally

**Telugu Jyothi**
Vignan Kumar Utukuri
Editor


## అధ్యక్షురాలి కలం నుండి...

**ఆగస్టు 31,2021**



ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు...

తెలుగు కళా సమితి సభ్యులకు ఆత్మీయులకు మరియు శ్రేయోభిలాషులకు ముందుగా Mother's Day మరియు Father's Day శుభాకాంక్షలు.

అలాగే వజ్రోత్సవ స్వాతంత్ర దిన శుభాకాంక్షలు. అవును మన భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరములు అయింది. ఈ సందర్భంగా ప్రపంచంలో నలుమూలలా ఉన్న ప్రతి భారతీయునికి మరోసారి వజ్రోత్సవ స్వాతంత్ర దిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఇకపోతే మనం ఇంకా ఈ Covid-19 మహమ్మారి ఉచ్చులో చిక్కుకుని ఉన్నాం.
ఉగాది వర్చువల్ ఈవెంట్ తర్వాత మేము మే లో మదర్స్ డే ని పురస్కరించుకుని Women & Financial Security webinar ను నిర్వహించాము. Women Financial అవగాహనని ఎక్కువమందికి చేర్చాలని ఈ వెబినార్ ను TLCA, WATS & HTCA Organizations తో కలిసి సంయుక్తంగా నిర్వహించాము. జూన్ నెలలో ఇంటర్నేషనల్ యోగ డే ని పురస్కరించుకొని Art of Living వారితో కలిసి Yoga for Mental health & Ayurvedic Herbs for Immunity seminar ను నిర్వహించాము.

మొదటిసారి అందరం కలిసి వేసవి వనభోజనాలు కార్యక్రమం August 8th చేయడానికి సన్నాహాలు చేసాము కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా ఆరోజు ఆ కార్యక్రమాన్ని నిర్వహించ లేకపోయాము. ఏదో సామెత చెప్పినట్లు దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వలేదు అన్నట్లుగా అయ్యింది.

ఇకపోతే TFAS కార్యక్రమాలను మళ్లీ మళ్లీ చూసే అవకాశం కల్పిస్తూ యూట్యూబ్ లింకులు మీతో షేర్ చేస్తున్నాను. అలాగే మీ అందరినీ మన TFAS యూట్యూబ్ ఛానల్ కు subscribe చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను. మన యూట్యూబ్ ఛానల్ లో ఇప్పటివరకు మన తెలుగు కళా సమితి నిర్వహించిన కార్యక్రమాలను చూడగలరు.

Watch **Women & Financial Webinar** using:
https://www.youtube.com/watch?v=5Tbj0HwrWqw

Watch **Yoga for Mental Health** using:
https://www.youtube.com/watch?v=Tk2JCInOljs

Please subscribe to our TFAS youtube channel called **TFAS Media** by using:
https://www.youtube.com/channel/UCkaznxGuQacYcUp0WAq7Jlg

మీ సేవలో
జాగర్లమూడి శ్రీదేవి
అధ్యక్షురాలు

# Telugu Fine Arts Society

## Board of Trustees : 2020 - 2022



Sreedevi Jagarlamudi
President



Bindu Yalamanchili
Secretary



Jyothi Gandi
Treasurer



Anu Para
Cultural Chair



Anuradha Dasari
IT Chair



Srinivas Cheruvu
Membership Chair



Ravi Annadanam
Community Chair

## Advisory Board



Anand Paluri
Chair



Ram Kolluri
Member



Sudhakar Rayapudi
Member



Dr. Janani Krishna
Member




Hari Eppanapally
Member

## Telugu Jyothi

Utukuri Vignana Kumar
Editor




తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
బాధ్యత, బాంధవ్యం, రక్షణ, శిక్షణలకు
ప్రతిరూపమైన నాన్నకు
HAPPY
Father's Day
From
TFAS Executive Committee

# సంపాదకీయం

తొక్కుడు బిళ్ళాట ఆడేటప్పుడు రైటా రాంగా అని అడిగితే చెప్పడానికి పక్కన మిగతా పిల్లలుంటారు. Covid 19 ప్రళయంలో ఏ ప్రభుత్వం 'రైటు' చేసింది, ఏ దేశం 'రాంగు' చేసింది చెప్పడానికి ప్రపంచం లోని వందల కోట్ల జనాభాలో ఎవరికీ సాధ్యం అయ్యేటట్లు లేదు. అసలు రైటేమిటి రాంగేమిటి అన్న ప్రశ్నకి కూడా సమాధానం దొఱకదేమో. నేను చచ్చినా పరవాలేదూ, mask వేసుకోనని కొందఱి వాదమైతే, నీ సంగతి కాదు, నువ్వు mask వేసుకోపోతే నేనూ నా పిల్లలూ చస్తాం అని మఱి కొందఱి ఘోష. వ్యక్తిగత స్వాతంత్ర్యానికీ సామాజిక బాధ్యతకీ పోరాటం ఎప్పుడూ జఱుగుతూనే ఉంది. ఫ్రెంచి తత్వ శాస్త్ర వేత్త Jan Paul Sartre అన్నట్లు 'Man is condemned to be free' అని సరిపెట్టుకోవాలా? సామూహిక శ్రేయస్సు (the concept of Enlightened self-interest as expounded by Alexis de Tocqueville way back in 1835 for example) లోనే వ్యక్తిగత పురోగతికి అందమూ అర్ధమూ ఉన్నది కాబట్టి individual freedom కి ఆంక్షలు విధించాలా? ఎవఱికి వారే యమునా తీరే ఐతే సంఘానికి సమాజానికీ దేశానికీ అర్ధమేమిటి. Sartre గారు చెప్పిన freedom లేకపోతే మానవుని మనుగడే లేదు. కానీ ఆ స్వాతంత్ర్యానికి కొంత కట్టడి లేకపోతే మానవ సమాజమే లేదు అన్నది నాలాంటి వాళ్ళ ఉద్దేశ్యం. నా కారులో నా ఇష్టం, నేను నేను నా కారు నడుపుతూ cell phone లో ఎందుకు మాట్లాడ కూడదు అన్న వాదనకి ఒకే సమాధానం: అది నీ రోడ్డూ నీ రాజ్యం ఐతే, నీ ఇంటిముందున్న drive మీదైతే ఏమన్నా చేసుకో. అందఱూ నడిచే దారిలో అందఱి కార్లూ తిరిగే రోడ్డు మీద నీ ఇష్టానికి కళ్ళెం వేయాలి, వేసుకోవాలీ అని.

అదంతా ఒక ఎత్తూ, నేను mask వేసుకోనూ, నువ్వు వేసుకుంటే నీ mask లాగేస్తానూ, నిన్ను బాదేస్తానూ, చంపేస్తానూ అన్న వాదన మఱొకటి. అంటే నా స్వాతంత్ర రక్షణ కాదు నా ఉద్దేశ్యం, నీకు నీ స్వాతంత్ర్యం ఉండకూడదూ, నువ్వు నా ఇష్ట ప్రకారం నడవాలీ అన్న నిరంకుశత్వం. ఇదే సరైన ప్రవర్తనా అని వాదింపు. అది మఱీ అన్యాయం.

New Jersey లో ఉంటూ నేనిలా బాహాటంగా చెప్పగలుగుతున్నాను, ఏ Tennesse లోనే ఐతే ఈ పాటికి నన్ను హొత్తెరికీ mask చేసుకోవడం మంచిదంటావా, ఎంత ధైర్యం నీకు, సంఘ విద్రోహక వ్యక్తిగా నిన్ను zip ties తో citizen's arrest అరెస్టు చేయాల్సిందే అని బెదిరించేవారేమో. ఇక ఇంతతో ముగిస్తాను, శలవు.


## సంపాదక వర్గం

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (సంపాదకులు), ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్,

లంకా వేంకట కృష్ణా రావ్, బొగ్గవరపు లవకుశ, తిప్పాభొట్ల రవిశంకర్, తాతా వేంకట సత్య ప్రభాకర మూర్తి

తెలుగు కళా సమితి ప్రతినిధులు

పారా అనురాధ

# విషయ సూచిక


అధ్యక్షురాలి కలం నుండి 5

సంపాదకీయం 8

ఆరోగ్యానికి సంగీతం [ ప్రభా రఘునాథన్ 10

దీపావళి తో నింపు | శ్రీదేవి శ్రీకాంత్ 11

ఆత్మ విశ్వాసం | ఉప్పల పద్మ 12

నేస్తం | K.L.V.D మహేశ్వరి (12 వ తరగతి విద్యార్థిని) 14

తేడా | యలమర్తి అనూరాధ 16

బహుమతి | వుప్పల పద్మ 16

క్షీరసాగరమథనం | నిష్టల సోమ శాస్త్రి 17

కన్నతల్లి | వేపూరి నాగేంద్ర కుమార్ 19

అసలు రహస్యం | నామని సుజనాదేవి 20

ఘనుడు నాన్న – త్యాగధనుడు నాన్న | డాక్టర్ ఎమ్.సుగుణ రావు 24

మృత్యుంజయులు | నామని సుజనా దేవి 24

నేను అనాథను కాను | శింగరాజు శ్రీనివాసరావు 29

కరోనా భయం | M.మహేష్ (7వ తరగతి విద్యార్థి) 34

తెలవారలేదు | P.L.N. మంగారత్నం 35

గుండెల్లో తడి | జడా సుబ్బారావు 37


**Opinions expressed in this volume are those of the authors and not of TFAS.**

# ఆరోగ్యానికి సంగీతం

**ప్రభా రఘునాథన్**

కర్ణాటక సంగీతం భక్తి మయమైనదని మనలో చాలా మందికి తెలిసిన విషయమే! సంగీత త్రిమూర్తులనబడే శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితులు వారి శిష్య పరంపర ద్వారా దివ్యమైన, భక్తి పరమైన ఎన్నో వేల కృతులను మనకందించారు. శాస్త్రీయ సంగీతాన్ని వినే శ్రోతలు మన ఆంధ్ర దేశంలో చాలా తక్కువ. అది తమిళులకే చాలా వరకు పరిమితమై, వారు సంగీతాన్ని వారి తరాలకే కాకుండా ముందు తరాలకు కూడా అందించి కృషి చేస్తున్నారు. పద్మ భూషణ్ నేదునూరి కృష్ణమూర్తి గారు అన్నమాచార్య, రామదాసాది కృతులను స్వర పరిచి, ఆ మహనీయుల కీర్తనలని ప్రచారంలోకి తెచ్చారు. వారి శిష్యులైన మల్లాది సోదరులు హైదరాబాదు, విజయవాడ మొదలైన నగరాలలో సంగీత శిబిరాలు నిర్వహించి ఈ కృతులను ఇంకా ప్రాచుర్యం లోకి తెచ్చారు. మన తెలుగు వారే కాకుండా ఇతర భాషల వారు కూడా ఆసక్తి తో ఈ కృతులను నేర్చుకుని వారి శిష్యులకి నేర్పి ఎన్నో వందల కృతులను ప్రచారంలోకి తేవడం చాలా గర్వించదగ్గ విషయం.

శాస్త్రీయ సంగీతం ఎన్నో రుగ్మతల నుండి కాపాడుతుందని వైద్యులు చెప్పడం జరుగుతూ ఉంది. సంగీతం మనసుకి హాయినిచ్చి, ఆహ్లాదాన్ని కలిగించడమే కాకుండా blood pressure, diabetes (రక్త పోటు, మధు మేహం) మొదలైన వ్యాధులకు ఉపశమనం కలిగిస్తుందంటే చాలా సంతోషించదగ్గ విషయం. నేను ఇండియా వెళ్ళినప్పుడల్లా నాకు తెలిసిన వైద్యులు శాస్త్రీయ సంగీతంలో కొన్ని రాగాలు – ఒక్కొక్క రుగ్మతకు ఒక్కొక్క రాగం విస్తారంగా పాడినది record చేసుకుని వారి పేషంట్లకు ఇవ్వడం, విన్న వారికి బాధలు తగ్గి ఆరోగ్యం మెరుగు పడటం జరిగిందని తెలిసి చాలా ఆనందమైంది. పాశ్చాత్య దేశాలలో కూడా రోగులకు therapy గా సంగీతం మంచిదని వైద్యులు చెప్పడం మనకి తెలుసు.

నా మిత్రులు meditation (ధ్యానము) మనసుకు, ఆరోగ్యానికీ మంచిదని సలహా ఇచ్చినప్పుడు, "నా సంగీత సాధనే నా meditation" అని వాళ్ళకు చెప్పడం జరిగింది. ఇతర విషయాల మీదికి ఆలోచన పోకుండా మనం పాడుకుంటున్నప్పుడు కానీ వింటున్నప్పుడు కానీ శృతి తాళం సరిగ్గా ఉన్నాయా లేదా అనే దృష్టితో నే అందులో తాదాత్మ్యం చెందటమే meditation అని నా ఉద్దేశ్యం. కాబట్టి శాస్త్రీయ సంగీతం మనసుకు హాయినిచ్చి, తద్వారా శరీరానికి కూడా ఆరోగ్యాన్ని కలగజేస్తుందనటంలో అతిశయోక్తి లేదనుకుంటాను.

సంగీతాన్ని అభ్యసించిన వారంతా గొప్ప విద్వాంసులై కచేరీలు ఇవ్వలేకపోయినా, అన్నమయ్య, రామదాసు కృతులు సరియైన పద్ధతిలో నేర్చుకుని అందులోని అర్థం తెలుసుకొని చక్కటి భావంతో పాడితే శ్రోతల మెప్పు సంపాదించవచ్చును. మన తెలుగు భాషను క్షుణ్ణంగా నేర్చుకుని మాట్లాడ గలిగితే ఈ శిక్షణ పొందిన విద్యార్థులు వారు నేర్చుకున్న కృతులు, కీర్తనలు, ఆ కృతి కర్తలు ఎప్పుడు ఏ సందర్భంలో ఆ ప్రత్యేకమైన రాగాన్ని ఎంచుకుని స్వరపరచారనే విషయం అర్థం చేసుకోగలరు. అప్పుడు మీరు ఏ కచేరీకి వెళ్ళినా ఆనందించగలరు. పై విషయాలు సంగీత విద్యార్థులందరూ ముఖ్యంగా తెలుసుకోవాలని విద్వాంసుల భావన.

సంగీత త్రిమూర్తుల ద్వారా సుమారు మూడు వందల సంవత్సరాల నుండీ మనలను అలరించిన సంగీతం ఇంకా ఎన్నో వేల సంవత్సరాలు ఆరోగ్యానికి భక్తికి ముక్తికి మార్గం చూపగలదని ఆశిద్దాం. సంగీతాన్ని అనుభవిద్దాం !

⏮ ♬ ♬ ♬ ♬ ♬ ⏭

# దీపావళి తో నింపు

## శ్రీదేవి శ్రీకాంత్

ప్రపంచాన చెట్టాపట్టాలేసుకు తిరిగే
సౌందర్య వసంత పరువం వంగిపోయింది
కోకిల శృతిలయల రాగగళం మూగబోయింది
ఉషస్సు లాక్ డౌన్లో నిరాశైంది
పుడమి కరోనా పొగచూరి మసకైంది

ప్రజల నివాసాలు కృష్ణ జన్మస్థానాలు
"ఆలింగన కరచాలనాలలో
నమస్కార సంస్కార మొక్కటే ఆనందమైంది"
విశ్వ యంత్రాలయాన మాస్క్ మూత..
హస్తాలకు సానిటైజరు మర్దనలు
శరీర నిత్య ఉష్ణ పరిమాణ తనిఖీలు..
మేకప్పులకు లాకప్పే

నగర వీధులన్నీ లాక్ డౌన్ స్మశాన మౌనాలు
సమస్త ప్రపంచం భయం గుప్పిట్లో ప్రతిష్టంభన
జనమానసాలకు అంతర్జాల మాధ్యమాంబుదనిష్ఠ ధారాపాతమైంది
పెళ్ళిళ్ళల్లో బంధువులకు సెలవు
ఆన్లైన్ వీక్షణలు పిల్లల చదువులు ఆన్లైన్
ప్రపంచం నీనుండి రక్షణ పొందే మందు కై
ప్రయోగాత్మక విశ్వవైద్యవిద్యాలయమైంది
పుడమి గర్భం పుట్టెడు మృతదేహాలను దాచుకున్న వల్మీకమయ్యింది

నిద్రలో కరోనా కలవరింతలు పీడ కలల మృత్యు వనాలు
కలల గొంతు నులిమిన కరోనా వైపరీత్యాలు గత వైభవాలు స్తబ్దత
వసంతాన్ని కబళించిన గ్రీష్మోష్మాన్నిపలకరించినా...
అవును! అని వెక్కిరింతగా చూస్తోంది.. శార్వరిలో కోయిల...
ఈ ప్రపంచాన్ని వీడింది, పోతూ పోతూ
అంతా ఒక్కటేజనులంతా ఒక్కటే
అని కరోనా చెప్పిన పాఠాన్ని వల్లె వేస్తూ
మనసులకు వెల్ల వేయమంది

కొండ అవతల కరోనా... నా వైపురాదన్న ధైర్యంతో కవిత రాస్తున్నా
యెందుకో యేమిటో...కలము వొణికింది
అక్షరాలు ధైన్యం లో మునిగాయి
అందరి ప్రేమను పొందిన నాకు ...అందరికీ కావలిసిన నాకు .....
నగర పాలి మేరలో దుఃఖ సముద్రాన్ని పరచి వేసింది..
కళ్లు మూసుకొని అంతర్ముఖి నయ్యాను
హృదయ కవాటాల్లోనుంచి మనసు బాధతో నిండిపోయింది
ఈ నగరాన్ని విడిచి వెళ్ళలేను
నా గృహ లాక్ డౌన్ గోడల మధ్య ఒంటరితనం

గడుపుతున్న రాత్రులతో వియోగ గాయం నా మనస్సుకు ఎన్నాళ్ళు?
పశ్చాత్తాపం తో రగిలిపోయే నా భాష...
వలువలు లేని నా తృష్ణానురాగ సంతతి
నగరం నడుమ తిరుగాడిన వైనం ఎలా మరువను

లెక్క లేని హృదయ శకలాలు
నగర వీధుల్లో చెల్లా చెదరై పడి ఉన్నాయి
వాటిని ముట్టు కోకూడదు...
ముట్టు విడిచి వెళ్ళడానికి పై వస్త్రం కాదిది, వక్షాన్ని వట్టి చేతులతో
పెరకడం వంటిది కదా దాటి పోవడానికి
మెదడులోని ఒక ఆలోచన కాదిది,
క్షుద్బాధ, దాహార్తి కాదు అమృతమయమైన హృదయమే కదా!
నావారు నా వారే అంతా...కానీ ముట్టు కోకుండా ఎలా తట్టుకోను?

నేనూ వెళ్ళిపోవాలిగా, ఇంక జాగు చేయలేను
లాక్ డౌన్ రచ్చలో నలిగి పోలేను..
సమస్తాన్ని తనలో కలుపుకునే కరోనా
నరమేధ సంద్రం రమ్మని సంకేతాన్నిస్తున్నట్టుంది
ప్రయాణానికి సిద్ధం కావాలి ఇక్కడే ఉన్నా..
ఎక్కడ దాక్కున్నా ఘనీభవించిన హృదయ వ్యధను
మంచు ముద్దలా కరిగించి---
నన్ను కరిగించేస్తుంది
నాలో ఇమిడి...భూదేవి పొరలో శాశ్వతంగా
బొజ్జో దేవీ అంటుంది కదా

వెళుతూ నాకున్నదంతా తీసుకొని వెళ్ళాలని ఉంది కాని ఎలా?
వాగ్విహంగాలకు రెక్కలనిచ్చిన పెదవులను,
ఆకారాన్నిచ్చిన నాల్కను మోసుకొని పోవడం
సాధ్యమయ్యే పనా? పక్షి తన గూడు విడిచి
ఆఖరి గమ్య స్థానం వైపు పయనించే సమయమాసన్నమైంది

ఇక్కడ నా పూర్వీకులు వున్నారే..
ఓ నా పితృ దేవతల్లారా!
ప్రపంచం, కరోనాబ్ధి అలల ఆటు పోట్లలో ఉంది
నా కలల జలధిలో యానం చేస్తూ మిమ్మల్ని కాంచాను
నిద్రాణమై వున్న స్వప్నాన్ని జాగరూకనై చేరుకున్నాను
నాలోని తమి జలధి తరంగాల పై
తేలియాడే గాలికొరకు వేచి చూస్తున్నది
ప్రయాణానికి సంసిద్ధంగా ఉన్నా నేను ఒక్క మారు,
నిశ్చలమైన ఈ ప్రకృతిలో ఊపిరి తీసుకొని
మరొక్క మారు గడచిన కాలంవైపు
చూడగలిగితే చాలు జలధి పథికురాలిగా
మీలో ఒక్కదాన్నై పోగలను

కరోనా! ఒక్క మారు, ఈ చివరి చిన్న మలుపు చాలు
అక్కడే ఉన్న నా ఆశలను పలకరించి వచ్చేస్తాను
నా ఆశల సర్వస్వాన్ని మృత్యువు గా మలచిన కరోనా!, నన్ను తీసుకో
నా ప్రపంచ ప్రజలను విడిచిపో---
నన్ను అర్పణ చేసి--- నిజంగా ఇది నా జీవన జ్యోతిని
ఈ శార్వరీ సంరక్షకుడా! విధాతా!
సృష్టిని దీపావళితో నింపు.

# ఆత్మ విశ్వాసం

## ఉప్పల పద్మ

రాఘవయ్య పొలం పనులు ముగించుకొని చిన్నగా ఇంటి బాట పట్టాడు. నడవనైతే నడుస్తున్నాడు కాని తన ఆలోచన ఏ మాత్రం బాటపై లేదు.అలవాటులో భాగంగా ఎలాగో మొత్తానికి ఇంటి దగ్గరికి వచ్చేసాడు. గడపలోకి అడుగు పెడుతుండగానే గట్టిగా శబ్దం.. అబ్బా ! అని అరుపు.. రాఘవయ్య తల ద్వారానికి గుద్దుకుంది.

ఆ శబ్దమే అది... ఈ అలికిడి విని

లోపలి నుండి ఒక్క ఉదుటున వచ్చేసింది కాంతమ్మ. అయ్యో ! ఏమిటండి... ఏం జరిగింది... ఏదో చప్పుడైంది. అవును మీరేంటి తల రుద్దుతున్నారు... ప్రశ్నల వర్షం కురిపించడంతో అబ్బా! నేనే ఏమరుపాటున ద్వారానికి గుద్దుకున్నానే.. తల బొప్పి కట్టి నేను చస్తుంటే నీ గోలేమిటే... అని సణిగాడు రాఘవయ్య.

అవునా, ఏదీ చూస్తాను.. అయ్యయ్యో ఎంత దెబ్బ తగిలిందో ఏమిటో.. అయినా మీకు ఎన్నడూ లేనిది ఇవ్వాలేమిటీ !ఇంత పరధ్యానం? సరే సరే జండూ బామ్ రాస్తాను అంటూ కాంతమ్మ బామ్ రాసి రాఘవయ్య తల బాధ కాస్త తగ్గించింది. కాని ఆయన మనసులోని బాధేంటో ఇంకా బోధ పడలేదు కాంతమ్మకు. ఆయనే చెప్తారులే అనుకుంటూ వంటింటి పనుల్లో మునిగిపోయింది.

అప్పుడే ఎంతో సంతోషంతో ఇంటికి వచ్చింది సరళ . రాఘవయ్య, కాంతమ్మల ఒక్కగానొక్క కూతురు సరళ. చిన్ననాటి నుండి సరళను అల్లారు ముద్దుగా పెంచారు ఆ దంపతులు. వాళ్లుండేది కుగ్రామమైనప్పటికీ సరళ ఆసక్తిని కాదనలేక మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న టౌన్లో డిగ్రీ చదివిస్తున్నాడు రాఘవయ్య. ఇప్పుడు సరళ డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమె బాల్యం నుండే ప్రతిభావంతురాలు. పది చదువుతున్నప్పుడే ఇంగ్లీష్, తెలుగు రెండు భాషల్లో టైపు పాసయ్యింది. తను స్కూల్లో, కాలేజీలో ఎప్పుడూ చదువులో ముందే. ఆట పాటల్లో కూడా ఎన్నో బహుమతులు సాధించింది. తను సరదాగా అప్లై చేసిన పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చిన సంతోషంలో అపాయింట్మెంట్ లెటర్ తో ఇంటికి వచ్చింది.

నాన్నా ! నాకు ఉద్యోగం వచ్చింది. నేను మరుసటి వారమే డ్యూటీ లో చేరాలని లెటర్ పంపారు అంది. అంతే ...

రాఘవయ్య కోపం కట్టలు తెంచుకుంది. మనకేం తక్కువ.. ఉద్యోగం చేయాల్సిన కర్మ నీకేంటి...

అయినా ఎవరు నిన్ను ఉద్యోగానికి దరఖాస్తు పెట్టమన్నారు. ఉద్యోగం లేదు ఏం లేదు. నేను నీ పెళ్లి గురించి ఆలోచిస్తున్నాను. పొద్దున్న పక్క ఊరి కరణం గారు మంచి సంబంధం ఒకటి ఉందని చెప్పారు. మంచి రోజు చూసుకొని వాళ్లను పెళ్లి చూపులకు రమ్మని చెప్పాను. అనడంతో కరెంటు షాక్ తగిలినట్లు అయింది సరళకు. అమ్మ కాంతమ్మ దగ్గరికి వెళ్ళి ఫిర్యాదు చేసింది సరళ ..

కాని కాంతమ్మ కూడా రాఘవయ్య ఆలోచనకే ఊతమియ్యడంతో చేసేది లేక తన గదిలోకి వెళ్ళింది.

★★★★★

ఇక పెళ్లి చూపులు జరగడం, ఆ వచ్చిన వాళ్లకు సరళ బాగా నచ్చడంతో అలా చూస్తుండగానే సరళ మెడలో మూడు ముళ్ళు పడిపోయాయి. సరళ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

కాకపోతే అత్తగారి ఊరు చాలా దూరం. అత్తారింట్లో కాలు పెట్టిన నాలుగు రోజుల కే భర్త పరమేష్ పచ్చి తాగుబోతని, మందును మంచి నీళ్లకు మల్లె మింగుతాడని టీనేజ్ నుండే అతడు తాగుడు వ్యసనానికి బానిసని తెలుసుకుంది. తన్నుకొస్తున్న కన్నీళ్లు ఒకవైపు.. తన జీవితం బుగ్గి పాలయిందన్న ఆలోచనలు మరోవైపు...

ఫోన్ సౌకర్యం కూడా లేని రోజులవి. తన దుఃఖాన్ని తల్లిదండ్రులతో కూడా పంచుకోలేని దుర్భర స్థితి. బాధ పడింది.. గుండెలవిసేలా ఏడ్చింది... కట్టలు తెంచుకున్న ఆవేదనకు ఆత్మవిశ్వాసంతో అడ్డు కట్ట వేసుకుంది. జరిగిన మోసం చెప్పి తల్లిదండ్రులను క్షోభకు గురిచేయకూడదని నిర్ణయించుకుంది. మనోనిబ్బరంతో జీవితాన్ని జయించాలని ధైర్యాన్ని కూడగట్టుకుంది.

రోజులు గడుస్తున్నాయి. చూస్తుండగానే చక్కని ఆడబిడ్డ పుట్టింది. ఇప్పుడు తన ఆలోచన అంతా తన బిడ్డపైనే. కీర్తి అని బిడ్డ కు పేరు పెట్టి తనను పెంచసాగింది. భర్త పరమేష్ లో ఎటువంటి మార్పు లేదు. రాదని సరళకు తెలుసు. అతన్ని మార్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది అవన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అయినా పరమేష్ ని భరించింది. మెల్లగా తల్లిదండ్రులకు పరమేష్ సంగతి తెలిసింది. సరళను పుట్టింటికి రమ్మని తండ్రి బలవంతపెట్టాడు. తొందరపడి పెళ్లి చేసానని రోదించాడు. సరళ మాత్రం ఇలా జరగాలని రాసి ఉందంటూ తల్లిదండ్రులను ఊరడించింది. అత్త వారిల్లు వదిలి రాలేనని తాగుబోతు అయినా పరమేషే తన భర్త అని తెగేసి చెప్పేసింది. భారతీయ స్త్రీ కి ఒక్కసారే పెళ్లి అనే సిద్ధాంతం తనది. తన భర్తను కొడుకులా భావించి జీవితకాలమంతా పయనిస్తానని, తన బిడ్డ కీర్తి ఆలనా పాలనా తన లక్ష్యంగా చేసుకుంటానని తన నిర్ణయాన్ని తెగేసి చెప్పింది. తనకు లభించిన జీవితాన్ని అంగీకరిస్తూ బిడ్డ భవిష్యత్తుపై దృష్టి సారించింది.

కాలెండర్ లు మారుతున్నాయి. కాని పరమేష్ లో ఏ మార్పు లేదు. ఇంకా తాగుడు ఎక్కువైందనే చెప్పాలి.రోడ్డు మీద.. ఎక్కడ పడితే అక్కడ పడిపోవడం.. అస్సలు ఇంటి ఊసే పట్టకపోవడం పరిపాటి అయిపోయింది.అతను అలా సోయి లేక పడి పోయిన ప్రతి సారి సరళ వెతుక్కుంటూ వెళ్లడం... చుట్టు పక్కల వారు తాగి పడిపోయే పరమేష్ పరిస్థితిని చూసి నవ్వడం... అన్నీ సరళ సహించేది. పొరపాటున నవ్వే వాళ్ళని ఏమైనా అంటే తన భర్తను ఇంటి దాకా తీసుకెళ్లడానికి సాయమొచ్చేది ఎవరు...?

తన పరిస్థితి తనకు బాగా తెలుసు. అందుకే ఎవరేమన్నా స్పందించేది కాదు.కాని ఎప్పటికప్పుడు ఆల్కహాలిక్స్ ని ఎలాగైనా మార్చాలి. అనే ధృడ సంకల్పాన్ని మరింత దృఢం చేసుకుంటుండేది. కాలక్రమేణా తాగి తాగి పరమేష్ కు పక్షవాతం కూడా వచ్చింది. అయినా సరళ అతని చేయి వదల్లేదు. ఎన్నో సేవలు చేసింది. కొన్నాళ్లకు పరమేష్ కన్ను మూసాడు. కూతురు కీర్తి, సరళ ... మాత్రమే... మిగిలారు. అయినా సడలని విశ్వాసంతో సరళ కీర్తి ని పెంచి పెద్ద చేసింది.

కీర్తి తల్లి ఆశలకు, ఆశయాలకు ప్రతిబింబం. ఆటపాటలు, చదువు... అన్నింటా చాలా చురుకుగా ఉండేది.

సరళ చుట్టుపక్కల కొంత మంది ఆడవాళ్లు ముచ్చట్లతో కాలం వెళ్లబుచ్చటం, మరి కొంతమంది చాలీ చాలని డబ్బులతో సంసారం భారంగా ఎళ్లదీయడం గమనిస్తూ ఉండేది. వారందరినీ సంఘటితం చేసి కుటీర పరిశ్రమ ప్రారంభించింది. రకరకాల వస్తువులు తయారు చేయటం ఆరంభించారు. స్వయం ఉపాధితో ఆ వీధిలోని మహిళల జీవితాలు చక్కబడ్డాయి. క్రమేణా సరళ ప్రారంభించిన పరిశ్రమ గురించి ఆ ఊరిలోని మహిళలందరూ తెలుసుకోసాగారు. ఇక ఊరిలోని మహిళలందరూ చైతన్యవంతం అయ్యారు. సరళను కలిసి ఆమె సహకారంతో విభిన్న వస్తువుల తయారీని చేపట్టారు. ఇప్పుడు ఆ ఊరిలో సరళ తెలియనివారు లేరు. ఆమె అంటే అందరికీ ఎంతో గౌరవం. ఊరు ఊరంతా ఉత్పత్తి

బాటలో నడిచి ఆర్థికంగా కుటుంబాలన్నీ నిలదొక్కుకున్నాయి.
కుటుంబాలలో వచ్చే చిన్ని చిన్ని గొడవలను కూడా సరళ చాకచక్యంతో, సమయస్ఫూర్తితో చక్క దిద్దుతూ ఉండేది.
కీర్తి డిగ్రీ పూర్తి చేసి సివిల్స్ కు ప్రిపేర్ అవుతోంది.. తల్లికి తగ్గ తనయగా కీర్తి సివిల్స్ ర్యాంక్ సాధించింది. సరళకు తన కూతురు సాధించిన విజయ వార్త ఒకవైపు.... ఆ సంతోషం ఇంకా ఆగక ముందే ట్రింగ్......ట్రింగ్ అంటూ ఫోన్ రింగ్ ... హలో ఎవరు అంది సరళ...మీ గురించి రాష్ట్రపతి గారికి తెలిసింది. వారు మిమ్మల్ని ఆదర్శ మహిళగా గుర్తించారు. ఎల్లుండి మీరు ఢిల్లీకి సత్కారం అందుకోవడానికి రావాలండి అనడంతో సరళ నోటి వెంట మాట రాలేదు. కన్నీళ్లు మాత్రం ఆనంద భాష్పాలుగా ప్రవహిస్తున్నాయి. ఎలాగో గొంతును నొక్కి పట్టి అలాగే నండి అంటూ ఫోన్ పెట్టేసింది.
జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. లభించిన జీవితాన్ని ఎంత కష్ట మైన మనమే అందంగా అమర్చుకోగలగాలి. సమస్యలు ఏవైనా, ఎన్నైనా అవి మనిషి మనోధైర్యానికి తల వంచాల్సిందే అని సరళ జీవితం చెప్పకనే చెబుతోంది.

కీర్తి వారు నివసిస్తున్న ఆ జిల్లాకే కలెక్టర్ అయింది. ప్రజలకు అండగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూనే తల్లీ కూతుర్లు కలిసి ఒక మోటివేషనల్ సెంటర్ పెట్టి చిన్న కష్టం వస్తేనే జీవితం అయిపోయిందని అర్ధాంతరంగా ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండేవిధంగా జనానికి మనో ధైర్యాన్ని కల్గించే పనిలో నిమగ్నమయ్యారు వారిరువురు.



# నేస్తం

K.L.V.D మహేశ్వరి (12 వ తరగతి విద్యార్థిని)

ఉదయాన్నే రెండు మూడు సార్లు సుప్రభాతం పాడాలి నా నేస్తం లేవాలంటే.....కళ్ళు విప్పగానే తను మొదటగా చూసేది నన్నే..... నాకోసం చేయి చాపగానే ఆప్యాయంగా వాలిపోతాను ఆచేతిలో..... మురిపెంగా చూసి నన్ను తడుముతాడు నా నేస్తం.

అంతే ఇక ఆరోజు నా జీవితం తన చేతుల్లోనే ఆరంభం....నన్ను విడిచి ఒక్క నిమిషం కూడా ఉండలేడు నా నేస్తం. తనశరీరంలో ఒక భాగం లా , తన గుండె చప్పుడు లా నన్ను కాపాడు కుంటాడు నా ప్రియ నేస్తం.

కాఫీ తాగుతూ నానుంచి గుడ్ మార్నింగ్ లు వగైరా లాంటివి అందుకుని మురిసి పోతాడు.....అలా నాలో లీనమైపోయి 5 నిముషాల్లో తాగే కాఫీ ని అరగంట తాగుతాడు.... నేను కూడా తనకి కావాల్సినవన్నీ అందించేసరికి నా వంట్లో ఓపికంతా హరించుకు పోయి నీరసం వచ్చేసరికి , నా డార్లింగ్ తో కాసేపు నన్ను కలిపేసి తను ఫ్రెష్ అయేందుకు వెడతాడు నా నేస్తం.... నేను ఎంతో హాయిగా సేదతీరుతూ ఫుల్ ఎనర్జిటిక్ గా తయారవుతానో లేదో వెంటనే నన్ను తన చేతుల్లోకి లాగేసుకుంటాడు నా నేస్తం..... నేనంటే అంత ప్రేమ తనకి.

తను ఆఫీస్ లో పనిచేసుకుంటూ ఉన్నా , తన పక్కనే ఉండి తనకి కావలసినవి అన్నీ అందిస్తూనే ఉంటాను నేను.... ఎక్కడికి వెళ్ళినా నేను తనతో తప్పని సరిగా ఉండాల్సిందే.... ఒకవేళ పొరపాటున మరిచిపోయి వెడితే ఎంత దూరం వెళ్ళినా వెనక్కి వచ్చి నన్ను తీసుకొని వెడతాడే కానీ , నన్ను వదిలి మాత్రం ఎక్కడికి వెళ్ళలేడు మరి....

ఇంక ఆఫీస్ కి శెలవు అంటే అంతే సంగతి..... రోజంతా నాతోనే.... నాకు జ్వరం వచ్చేసే దాకా వదలడు.అప్పుడు కాస్త విశ్రాంతి నిచ్చి , తన వాళ్ళమీద దృష్టిని సారిస్తాడు తను.....

నాలాగే నా నేస్తం భార్యకు కూడా ఒక ప్రియనేస్తం ఉంది , ప్రాణప్రదంగా చూసుకుంటుందావిడ.....తన కొడుకు పదిసార్లు పిలిచినా పలకదు కానీ.....తన ఫ్రెండ్ "టింగ్ "మంటే చాలు వాలిపోతుంది తనదగ్గర...

నా నేస్తం భార్య ఒక సవ్యసాచే మరి! , ఎలా అంటే ఒకచేత్తో పనులు చేస్తూనే, మరో చేత్తో తన ఫ్రెండ్ తో ప్రపంచం అంతా చుట్టేస్తుంది....వంటచేయాలంటే తన సలహాలే......పూజ చేయాలంటే తన ఆధ్వర్యమే.... అబ్బో ! ఫిట్ నెస్ , ఫ్యాషన్లు , షాపింగులూ , ఇదీ అదీ అనేదేముందీ ఏ టు Z అన్నీ తన సలహాలు , సూచనలతోనే .... అంతేకాకుండా ఈ సమాచారమంతా తెలిసిన వారందరికీ చేరవేయవలసిన బాధ్యతంతా ఇద్దరూ ఒకరికొకరు తోడుగా చేసుకుంటూ రోజంతా తెగ హడావుడి పడిపోతుంటారు పాపం....

ఎప్పుడైనా ఏదైనా పార్టీ లకో , గెట్ టుగెదర్ లకో వెళ్ళామనుకో ఇంక చూడాలి నా హంగామా.... మొత్తం హడావిడి అంతా నాదే.....

కలుసుకోగానే మొక్కుబడిగా అందరూ కరచాలనం , పలకరింపులూ అయి కాసేపటికే ఎవరి నేస్తాలతో వారు లీనమై పోయి , కంటిచూపును కూడా ఖాతరు చేయకుండా రెప్పార్పకుండా చూస్తూ తన్మయత్వం లో మునిగి తేలుతూ , కర్ణభేరీలు వాచిపోయినా లెక్క చేయకుండా మాటల్లో మునిగి పోతూ ఉంటే.....ఆనందించాలో , బాధ పడాలో తెలియని స్థితిలో ఏమీ చెప్పలేనీ , ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోతాను నేను.....

అప్పుడప్పుడు నా నేస్తం తన భార్య , బాబు తో వాళ్ళ అమ్మానాన్నగారిని చూడడానికి వాళ్ళ ఊరు వెళ్లుతుంటాడు.....

ఇక్కడ లా అక్కడ నాతోనే గడపాలంటే కదరదు తనకి .... ఈ విషయం లో చాలా మధన పడిపోతాడు పాపం.... అలవాటు ప్రకారం నన్ను ముట్టుకుంటే చాలు వాళ్ళ అమ్మగారు కేకలేసి....రాక రాక వస్తావు , ఇక్కడ కూడా దీనితోనేనా......అంటూ మమ్మల్నిద్దరినీ విడదీసి పారేస్తుందావిడ. ఏమాట కామాట చెప్పుకోవాలి.... అప్పుడు మాత్రం నాకు భలే విశ్రాంతి దొరికేది.... అందుకే ఊరు వెళ్ళడం అంటే నాకు ఎంతో ఇష్టం.

ఎప్పటిలానే ఈ సారి కూడా అందరం ఊరు బయలుదేరి వెళ్ళాము. నా నేస్తం అమ్మగారు నాన్నగారు ఎంతో ఆనందంగా ఎదురు వచ్చిఆప్యాయంగా హత్తుకోగానే.....వాళ్ళ దగ్గర ఉన్న కొత్త నేస్తాలు నన్ను చూసి పలకరింపుగా నవ్వగానే..... ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను . ఇన్నాళ్లు ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ ఇంట్లో కూడా నేస్తాల సందడి మొదలైంది....ఆహా! ఇక్కడ కూడా నా సామ్రాజ్యం విస్తరించిందని నాలో నేను అనుకుంటూ...

ఫ్రెష్ అవడాలూ , తినడాలూ , కబుర్లూ అన్నీ రెండు గంటల్లో పూర్తి చేసేసి నా నేస్తం వాళ్ళ అమ్మ నాన్నలు వాళ్ళ కొత్త నేస్తాలతో బిజీ అయిపోయారు.....వాళ్ళని చూసి నా నేస్తం , తనభార్య ముసిముసిగా నవ్వుకుంటూ మా వెంట పడ్డారు.....ఆహా ఇక్కడ కూడా నా సామ్రాజ్యం విస్తరించిందని నాలో నేను అనుకుంటూ నా నేస్తం తో జతచేరిపోయాను.....

కృష్ణ పరమాత్మ ఒక్కడే , కానీ తనను ఆరాధించే గోపిక లందరి దగ్గరా తానే అయినట్లుగా.... నేను నా ప్రియ నేస్తాలందరికీ ప్రియాతిప్రియమైన నేస్తాన్నైపోయాను ఈ ప్రపంచం అంతా నేను .ఈ పాటికే మీ కందరికీ నేను మీ ప్రియమైన "సెల్ ఫోన్(చరవాణి)"నని ఎప్పుడో అర్థమయిందని నాకు తెలుసు ! ఎప్పుడూ నన్ను చూడడమే కాదు , నేను చెప్పే మాటలు కూడా వినండి దయచేసి.....

చిన్నప్పుడు అన్నం తిననని మారాం చేసే మీ పిల్లలకు నన్ను చూపించి అలవాటు చేసింది మీరే.....మరి వాళ్ళు పెరిగి మీలాగే నాకు చేరువైపోతే , తిట్టి కొట్టి , బెదిరించీ.... దీనికంతటికీ నేనే కారణమంటూ , నన్ను నానా మాటలూ అంటూ నా తల పగులకొట్టేదీ మీరే.... మీకు నచ్చినప్పుడు , అవసరమైనప్పుడు నాతో వాళ్ళని వదిలేయడం , నచ్చనప్పుడు క్రమశిక్షణ గుర్తుకొచ్చి దండించడం.....

ఇంకా ప్రపంచం అంటే తెలియని పసివాళ్ళు కదా వాళ్ళకి మీరే ప్రపంచం అవ్వాలి....కానీ వాళ్ళ ప్రపంచం నేనే అయిపోవడాని కారణం మీరే అని గుర్తు చేసుకోండి....వాళ్ళ భవిష్యత్తు కోసం అయినా నన్ను దూరం పెట్టి , నాద్వారా ముక్కూ మొహం తెలియని వారితో పంచుకునే మీ విజ్ఞానాన్ని , వికాసాన్ని , ఆనందాన్ని మీ పిల్లలు ,మీ కుటుంబ సభ్యులతో పంచుకోండి , అప్పుడు మీరు ఎంత అమూల్యమైన జీవితం కోల్పోతున్నారో మీకు అర్థం అవుతుంది .... నాకు ఎంతో ప్రియమైన నా నేస్తానివి కనుక నీకు చెప్పడం నా ధర్మం అనిపించింది నాకు.....మొన్న ఊరు వెళ్లి నప్పుడు చూసావా , కొడుకు , కోడలు ,మనవడు వచ్చారని ఎంతో సంబరంగా స్వయంగా ఎన్నో పిండివంటలు తన ప్రేమనంతా వాటిలో కలిపి చేసే తల్లి అన్నీ కొనుక్కుని వచ్చి పెట్టింది .......చక్కగా ఊరు ,పొలం, తోటల్లో తిప్పి బంధువుల తో చెప్పి మరిసిపోయే తండ్రి అసలు ఒక్క రోజు కూడా సరిగా మీతో గడపకపోవడానికి కారణం ..... నువ్వే వాళ్ళని కూడా సెల్ ఫోన్(చరవాణి) కు చేరువచేయబట్టేగా.....

అసలు మీరంతా ఈ ప్రపంచం మీ చేతుల్లోనే ఉందని మురిసిపోతున్నారు ....కానీ ! మీరు , మీ బంధాలు అన్నీ నా చేతుల్లో ఉందని మీరు గ్రహించారా ఎప్పుడైనా?.....

మీ చేతులమీదుగా నేను నడిచినా , మిమ్మల్నందరినీ నడిపించేది నేనే.... ఈ ప్రపంచాన్ని నా గుండెల్లో ఇముడ్చుకున్న నన్ను , ఎలా ఎంత వరకు ఉపయోగించుకోవాలో అంతవరకు అనే విషయం వదిలేసి , మీ మితిమీరిన ధోరణి వల్ల మీ విలువైన కాలాన్ని కోల్పోతున్నారు.....మీ పిల్లలు మీకు దూరం అయిపోతున్నారు , మీ పెద్దల్ని మీరు దూరం చేసుకుంటున్నారు , ఆఖరికి మీ మూర్ఖత్వంతో నా వలన మీ విలువైన ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నందుకు నాకు చాలా బాధ గా ఉంది నేస్తం....ఇది మీకు తెలిసే సరికే మీరు విలువైనవన్నీ కోల్పోతారు.....

అందువల్ల దయచేసి నా ప్రియ నేస్తమా ! నన్ను నీ ఎదుగుదలకు, సమాజాభివృద్ధికి ఉపయోగించుకో.... నీకు తెలుసు నాలో ఎంత మంచి ఉందో , అంత చెడు కూడా ఉందని..... అందుకే నన్ను ఎలా ఎంతవరకూ ఉపయోగించుకోవాలో మీ అందరికీ తెలుసు.....నన్ను మీ శరీరం లో ఒక భాగం గా కాకుండా , ఒక వస్తువు గానే చూడండి.... లేకుంటే మీ ముందు తరాలవారు పుట్టగానే శరీరంలోపల అమర్చేసుకుంటారేమో.....

తస్మాత్ జాగ్రత్త!

---

Polepalle Foundation and the HELP Foundation.org

HELP FOUNDATION
HEALTH AND EDUCATION FOR LESS PRIVILEGED

We (Sankara Rao, as a Board of Trustee from 1984 to 87 and Madhavi Polepalle, as a volunteer) havebeen associated with the TFAS since its inception in 1984, and also are proudly associated with the TriMurthy Day since its inaugural event in 1987. It is our wish this tradition be continued in the years to come. We are and will be very happy to sponsor the annual TriMurthy Day thru Polepalle Foundation and HELP Foundation.org jointly. We want to thank TFAS for giving us this opportunity.

SOMIREDDY
LAW GROUP

Santosh Reddy Somi Reddy Esq.
Main 703-544-2200
Offices: Ashburn, VA | Silver Springs, MD |
Hyderabad, India • www.somireddylaw.com

## తేడా

### యలమర్తి అనూరాధ

అప్పుడు అబ్బాయిలు.. ఇప్పుడు అమ్మాయిలు..
భవిష్యత్తును ఎంచుకునే దిశలో..
నిర్ణయాలు తీసుకునే దశలో..
అరాయించుకోలేని పరిస్థితుల్లో, నేటి సమాజం.

ఎందుకో? ఈ అసమానతల పల్లకీలు
నీతుల్లో కూడా జెండర్ల పరకాయప్రవేశాలు
సృష్టిలో సగమైనా. నిజజీవితంలో లెక్క తక్కువే
బ్రతుకు చిత్రం. మాత్రం విచిత్రమే.

స్త్రీ సహనానికి నిలువెత్తు ప్రతిబింబం
అసహనం అంచులు తాకితే రుద్రకాళి
అప్పుడూ ఇప్పుడూ అభియోగాల మేళవింపులే
నిజం ఎంతో పడతులకే తెలియాలి
సమస్య అంతు చూడాల్సిందే
కాదనను నా కలికి నేస్తాలూ

తప్పుడు పనులకు మాత్రం దూరం దూరం
బుల్లితెర కళంకం మొత్తం పడుతులకే ఆపాదం పరిమితం
ఔన్నత్యానికి ప్రాధాన్యత ప్రముఖం
ఏది ఏమైనా మంచికి ప్రతిరూపంగానే మనం

## బహుమతి

### వుప్పల పద్మ

ఆమె నిశీథిలో నెలవంక
తన చుట్టూ ఉన్న వాళ్ళ జీవితాల్లో
వెన్నెల పూలను పూయిస్తుంది

ఆమె ఓ చైతన్య పతాక
అన్ని రంగాలలో తానై
ఆకాశమే హద్దుగా రెపరెపలాడుతుంది

ఆమె ఓ నిశ్శబ్ద కెరటం
సమస్యల గండాలు ఎన్నైనా
ఉనికిని కోల్పోని ప్రయాణం చేస్తుంది

ఆమె ఒక కారుణ్య శిఖరం
కష్ట సమయంలో మనసున
ఆర్ద్రతను కురిపిస్తుంది

ఆమె ఒక శాంతి శిల్పం
ఉవ్వెత్తున ఎగసిపడే ఉపద్రవాలకు
చెరగని చిరునవ్వవుతుంది

ఆమె స్థైర్యానికి నెచ్చెలి
సుడిగుండాల తాకిడికి జీవిత నౌక
కొట్టుకుపోకుండా దరికి చేరుస్తుంది

ఆమె అనురాగాలలోగిలి
తన సౌఖ్యాన్ని త్యాగానికి కట్టబెట్టి
ప్రేమ పన్నీటిని చిలకరిస్తుంది

ఆమె ఒక అక్షయ పాత్ర
అందరికీ అన్నీ వడ్డించి మిగిలిన నాలుగు మెతుకులనే
నైవేద్యంలా కళ్ళకద్దుకొని కాలం వెళ్లబుచ్చుతుంది

మొత్తంగా ఆమె..
అవని దక్కించుకున్న
అపురూప బహుమతి

# క్షీరసాగరమథనం

## నిష్ఠల సోమ శాస్త్రి

క్షీరసాగర మథన కార్యక్రమం సంపూర్ణమైంది. స్వచ్ఛమైన ధవళవస్త్రాలలో, హస్తాల మధ్య సువర్ణకలశంతో ధన్వంతరి ప్రత్యక్షమైనాడు. వితరణ కార్యక్రమానికి మోహిని తదితరులు అప్పటికే విచ్చేసి ఉన్నారు. ధన్వంతరి కలశాన్ని మోహినికి అందించబోతున్నాడు.
ఆగండి....విశ్వాంతరాళాలు దద్దరిల్లే పెనుగర్జన."మీరు సాధించిన ద్రవ్యమును seize చేసీ ప్రయోగశాలకు పంపమని, ఈ మథనంలో జరిగిన అవకతవకల మీద సమగ్ర నివేదిక సమర్పించమని Chief Justice of Indralok యమధర్మరాజుల వారు suo moto cognizance తో ఆదేశించేరు". ఆజ్ఞాపిస్తున్నట్లే ఉన్నది కంఠం.

ఆర్యా, తమరు ఇంత విలంబముతో వేంచేసి మా శ్రమను పెంచినారు గదా. కొంత త్వరితముగ వచ్చి కార్యమును మధ్యలోనే ఆపించిన యెడల సాగరమున ఈశ్రమ మాకు తప్పియుండెడిది గదా!!. అలసిన మాకనులకు మీరు కూడ యిద్దరివలె కనబడు చున్నారు. అనేకమైన శ్రమదమాదులకోర్చి ఇంతకాలము తరువాత దివ్యౌషధాన్ని పొందగలిగితిమి. స్వయాన ధన్వంతరి గారిచే ప్రామాణితమైనది. వీరిచే విరచించబడవలసిన పొత్తములే యుగముల తరువాత ఆయుర్వేద విద్యార్థుల పాఠ్యగ్రంథములగుని తమకు తెలియని విషయమా ఏమి అని వేదనతో ప్రశ్నించేరు దేవదానవులు.

ఆపండి మీ పరాచికాలు. మీ దృష్టి సరిగ్గానే ఉంది. మేము ఒకళ్ళం కాము, ఇద్దరమే, అశ్వనీకుమారులం, కవలలం. ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్తాం. ఇది న్యాయస్థానము వారిఆజ్ఞ. మేము నిమిత్తమాత్రులము. క్లుప్తముగా మారాకలో జరిగిన విలంబమునకు, మాచర్యలకు గల నేపథ్యమును వివరింపగలము.

ముందుగా రామర్ పిళ్ళె అను తమిళదేశీయుడు నాకడ Herbal సాంబార్, క్షమించుడు Herbal petrol అను రసాయనము ను తయారు చేయు సూత్రము తన కడనున్నదని దాని వలన వాయువేగ, మనోవేగములతో సంచరించు స్వయంచాలక వాహనములను నడుపగలమని నందనవనమున వృక్షము ల పత్రములనెల్ల ద్రుంచి వాటిని నీట మరిగించు కార్యక్రమము తలపెట్టినాడు. పాపమేలనో గాని ఈనాటికి గూడ ఒక్క బిందువైనను యంత్రముల బడలేదు. ఆశ వదలుకొని చివరికి ఎటులనో యిచటకు చేరితిమి. అందువలననే ఆలస్యము.

ఇక యిచట మీరు చేయుచున్న కార్యక్రమమును ప్రత్యక్ష జీవ ప్రసారమును చూచుచూ సమాపనమున పుష్ప వర్షము కురిపించుటకు బ్రహ్మాండ పౌరులు సన్నద్ధులైయున్నారు, కాని...

యిచట జరుగుతున్నదేమి? ప్రాప్తించినవేమి? ప్రప్రథమముగా జంతురాజములు, ఉచ్ఛైశ్రవము, ఐరావతము. మీ సంకల్పమేమి? ఫలితమేమి. అయినను మీరు అదే ప్రక్రియను నిరంతరము కొనసాగించిరి, లభించినవేమి? చంచలయు, స్థిరము లేని లక్ష్మీదేవియు మరియు జన్మజాత క్షయరోగియైన చంద్రుడును. అయినను మీరు మొండితనముతో కొనసాగి అత్యంత విషకరమైన హాలాహలమును పుట్టించినారు. ఇన్ని వైఫల్యముల తరువాత లభించిన ఈద్రవ్యము యమృతమేనని, దేవదానవుల సేవనయోగ్యమని ఎటుల తలపోయుచున్నారు?...

ఇది యిట్లుండ, మీరు ఈ ప్రక్రియ నందు సర్పకూర్మములను హింసించుచున్నారని అది జంతువులపట్ల క్రూరతయని మేనకా బూంది యను నామె యాచిక దాఖలు చేసినది. ఉచ్ఛైశ్రవ, ఐరావతములను దేవరాజు ఇంద్రుడు కొనిపోవుట దేవదానవుల శ్రమదోపిడియని, "దేవదానవుల యవనాశ్వములకు, మదగజమ్ములకు ఖరీదు కట్టే కుబేరుడెవడోయని"

శ్రీశ్రీశ్రీ కూరల మార్కులవారు విప్లవశంఖము పూరించినారు. ఇక లోకమాత పార్వతి, తన భర్త చే విషపానము చేయించుట చేత, abetment for suicide అభియోగము మీపై మోపినది. ఇవి యిట్లుండగా శుక్రాచార్యుల కడ మృతులను బ్రతికించు మృతసంజీవని యుండ మృత్యువేలేకుండగ జేయు ఈ ప్రయత్నమునకు సమ్మతి తెలుపుట జాతీయనిధుల దుర్వినియోగము, బ్రహ్మాండ ప్రయోజనములను ఆదోని అంబుమణికి తాకట్టు

పెట్టుటేనని యువనాయకుడు బైరాగుల మైనా కోడైకూయుచు స్వర్గాధిపతి మహేంద్రనాథ్ దేవేంద్రనాథ్ పై ఏకు మేకైనాడు. అందువలన ఉచ్చన్యాయస్థానము ఈ ద్విసభ్య ఆయోగమును ఏర్పరిచినది. మీరు సహకరించిన యెడల కొలది దినములలో నివేదిక సమర్పించగలవారము.

రెండురోజుల తరువాత....

ఈ సంఘటన పూర్వాపరాలు పరిశీలించిన పిమ్మట ఆయోగము ఈ నిష్కర్షకు వచ్చినది.
మంథనము ...ప్రమాణాల ప్రకారము నిర్వహింపడినను సాధనములు ఇంతకు మునుపెన్నడూ ఉపయోగింప బడలేదు. అవి ప్రచ్ఛన్నముగా యున్న జంతువులు గాని జన్మనా కావు. కావున వాని యెడల కృరతను శంకించుటకు తగిన కారణము కనిపించదు. తొలిదశలో వైఫల్యమునకు కారణము ఘర్షణ వలన వాసుకి మఖమునుండి వెలువడిన విషస్రావము. మంథనమున కోరుకొని ముఖదిశగా నున్నదానవులకు, స్రావ ఆగమమును గమనించుటకు, నియంత్రించుటకు పర్యాప్తమైన అవకాశమున్నను ఉదాసీనత చూపుట, కర్తవ్యనిర్వహణలో త్రుటిగా భావించి అమృతపానమునకు అనర్హులనియు మరియు పాతాళమునకు బహిష్కరింప బడుతున్నారని విశదము చేయబడుతున్నది. అంతిమ ప్రయత్నము అవాంతర రహితమగుట వలన లభించిన ద్రవ్యము అత్యున్నత గుణవంతమై అమృతమను పేర దేవతలకు పానయోగ్యము.

“ఏరాశాస్త్రీ? నీకు specialగా చెప్పాల్రా? కదులు పాతాళానికి”వీపు మీద పడింది బలంగా లాఠీ. ఊహించని పరిణామానికి ఉలిక్కి పడ్డాను."పని మనిషి నాగమణి మొగుడికి కరోనా వచ్చిందిట, కొన్ని రోజులు పనిలోకి రానని phone చేసింది. మీరింట్లో BJPలో support చేయ్యాలి లేవండి”అని తట్టి లేపుతోంది విద్య.

"రాత్రిళ్ళు ఈకడప మందు debate వీడియోలు చూడడం ఆపాలి లేకపోతే ఇవే పాడుకలలు”అని లోపలికి (బయటికి), ఏవోయ్, యింట్లో BJP support ఏవిటి? అడిగేను లేచి."అదే మీరు మీ బ్రహ్మచర్యంలో చేసుకున్నవి: Bartan, Jhadu, Pocha”అంటూ కిచెన్ వైపు దారి తీసింది శ్రీమతి.



# కన్నతల్లి

## వేపూరి నాగేంద్ర కుమార్

కల గంటిని నేను కల గంటిని
నా కన్నతల్లిని కనుగొంటినీ
నిండు నూరేళ్ళు వర్ధిల్లమని నన్ను
నిండైన మనసుతో దీవించుచున్నట్టి
నా కన్నతల్లిని కనుగొంటినీ .... !! కల !!

నవ మాసములు నన్ను కడుపునా మోసీ
అపురూపమున నాకు వేడుకలు చేసీ
అడుగు అడుగున నన్ను పదిలముగ కాపాడి
జన్మ నాకిచ్చుటకు నరకయాతన పొంది
తన తనువునే చీల్చి నే బయటికొచ్చినా
హృదయానికద్దుకొని ముద్దాడి మురిసిన
నా కన్నతల్లిని కనుగొంటినీ !! కల !!

ఆకలితో,దాహంతో నేనేడ్చితే తన
పాలిండ్లు నాకిచ్చి ఆకలిని తీర్చీ
చిరునగవుతో నేను చిందులను వేస్తే
చిటికెలేస్తూ తాను ఎంతెంతో మురిసీ
నిదుర రాకా నేను మారాము చెస్తే
రాత్రంత మేలుకొని జోలపాటలు పాడె
నా కన్నతల్లిన కనుగొంటినీ .... !! కల !!

అడుగులతో తడబడుతు క్రింద నే పడితే
పైకి నను లేపుతూ నడకలను నేర్పి
చదువు నాకొద్దంటు అల్లరిని చెస్తే
తొలి గురువు తానై అ ఆ.. లు దిద్దించి
గోరుముద్దలు పెడుతు, నీతికథలను చెప్పి
తెలివితేటలు నాకు నూరిపోసినయట్టి
నా కన్నతల్లినే కనుగొంటినీ..... !! కల !!

దగ్గయిన, రొంపయిన, చిన్ని జబ్బయినా
పగలు రాత్రని లేక సేవలను చేసి
చిన్ని నా కొండా చిక్కిపోయావంటు
ఆకలెంతున్నా తను పస్తులుండీ
కొసరి కొసరీ నాకు అన్నమొడ్డించీ
లోటంటు నాకేమి లేకుండ చేసిన
నా కన్నతల్లినే కనుగొంటినీ .... !! కల !!

ఆట పాటల్లోన, చదువుసంధ్యల్లోన
అందరిలో మేటంటు పొగడబడుతుంటె
దృష్టి దోషమునుండి కాపాడి నను జూసి
ఆనందభాష్పాలు కనుల రాలంగా
తండ్రి పేరును నేను నిలిపినానంటు
నా చిట్టితండ్రంటు మురిసి పోయినయట్టి
నా కన్న తల్లినే కనుగొంటినీ ..... !! కల !!

పై చదువులంటూను పొరుగూరు నేబోతె
ఉద్యోగమంటూను వేరె దేశము బోతె
తన ఆకలిని నేను తీర్చలేకున్నా
తన ఆరోగ్యమును కాపాడకున్నా
గొప్ప మనసుతో నన్ను క్షమించి దీవించి
ఎప్పుడైనా గాని, ఎక్కడున్నా నేను
శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లమని కోరె
నా కన్న తల్లినే కనుగొంటినీ ..... !! కల !!



COLDWELL BANKER
BINDU YALAMANCHILI ABR®, SRES®
CELL : (908) 240-3167
BinduNJhomes@gmail.com
www.binduNJhomes.com

# అసలు రహస్యం

నామని సుజనాదేవి

'నీలాతుంగ స్తనగిరి తటీ సుప్త ముద్బోధ్య కృష్ణం..... ..' ధనుర్మాసపు చల్లటి చలిలో గుడి లోని మైక్ నుండి వినపడుతున్న తిరుప్పావై తో మెలకువ వచ్చింది ఇతిహాస్ కి. తల తిప్పి పక్కకు చూసాడు. ఊహించినట్లు గానే పక్కన పడుకునే అక్షయని స్థలం ఖాళీగా ఉంది. ప్రతీ ధనుర్మాసం లో కాలనీ లోని మహిళలంతా దాదాపు ఇరవై నుండి ముప్పై వరకు పొద్దుటే అయిదు గంటలకే మంగళ హారతులతో గుడికి వస్తారు. అంతటి చల్లటి చలిలో కూడా వచ్చేలా క్రమశిక్షణ నేర్పించిన ఆ తల్లికి నమోవాకాలర్పించాడు. పోయిన ఏడాది అయితే తన బాహువుల్లో వెచ్చగా ఒదిగిన ఆమె వీడలేక వీడలేక విడి వడుతుంటే ఇంకా గారంగా పొద వుకునేవాడు. కాని సంకల్ప బలం గొప్పదన్నట్లు మృదువుగా తన నుదుటిపై ముద్దిస్తూ విడిపించుకుని తయారై గుడి కెల్లేది. ఆమె లేక మంచంలో పడుకోలేని తను కూడా సూదంటురాయిలా తన మనస్సును ఆమెతో పాటు తీసుకెళ్ళిన ఆమె వెంట మంత్ర ముగ్ధుడై కాస్సేపు అటు ఇటు పడుకుని, లేచి స్నానం చేసి వెళ్ళేవాడు. అప్పటికి తిరుప్పావై అయిపోయి సరిగ్గా హారతి సమయం అయ్యేది. శ్రావ్యమైన కంఠం తో 'అమ్మా గోదా హారతి గైకొని అమృతము చిలకవే మాయమ్మా..' అంటూ పాడుతుంటే తన్మయత్వంతో వినేవాడు. మిగతా వాళ్ళంతా కోరస్ కలిపేవారు. తర్వాత ప్రసాద వినియోగానికి తను 'ఆదిశేషా అనంత శయనా ...' అనో ,'నంద నంద గోపాలా ఆనంద నంద గోపాలా..' అనో భజన చెప్పేవాడు. అంతా ఆదర్శ దంపతులు అన్నట్లు అ సూయగా చూస్తుంటే ఇంటికి కలిసి వచ్చేవారు . అప్పటికి ఆరే అయ్యేది కాబట్టి ఇంకా వీడని చిరు చీకట్లలో తన వెంట అలా మంగళ హారతి పట్టుకుని వస్తున్న ఆమె తో కల్సి రావడం ఒక అందమైన అనుభూతి. ఆ వీధి లోని అందరి మంగళ హారతులతో వింత అందం తో ఆ వీధి అలరారేది. ఇంకా ఇంటికి రాగానే వేడి వేడి ఫిల్టర్ కాఫీ తెచ్చేది. కుర్చీలో తన ఒళ్లో కూర్చుని తాగేవాళ్ళు . అసలు ఆ చలిలో వెచ్చని ఆ కాఫీ ఆస్వాదించడం ..ఆహా.. ఎంత మధురంగా ఉండేదో... ఏవీ ఆరోజులు... నిజంగా అందరి దిష్టే తగిలిందా.....

మొన్న అక్షయని పుట్టిన రోజున ఆఫీస్ నుండి త్వరగా రమ్మంది. కానీ తనకు చాలా ఆలస్యం అయ్యింది. ఎందుకయ్యిందో చెప్పబోతున్నా వినిపించుకోకుండా, 'నాకు తెలుసు మీకు రోజు రోజుకు ప్రేమ తగ్గుతోంది... నాకే సంజాయిషీ అవసరం లేదు... అది దేబిరించి అడిగి తీసుకునేది కాదు , మీకై మీరే నాతొ గడపడానికి ఇష్టపడాలిగాని...' అంటూ వెళ్ళిపోయింది. తనపై చూపించే ప్రణయం కాస్తా ప్రళయమై పోయింది . ఇక అప్పటి నుండి మాటలు మానేసింది. అప్పటి వరకు ఎప్పటికీ ఎ పనిలో నైనా తననే అంటి పెట్టుకుని ఉండే ఆమె కనీసం తగలనైనా తగల కుండా ఉంటోంది. తనే ప్రాణంగా మెదిలిన ఆమె ఇప్పుడు అసలు తన ఉనికినే మరిచి నవ్వడం మరిచిన మరబొమ్మలా మెదలుతోంది. అంతకు ముందు సెలయేరులా, గలగలా ప్రవాహంలా మాట్లాడిన ఆమె ఇప్పుడు గంభీరంగా ప్రవహించే నదిలా తయారైంది. తను లైట్ గా తీసుకున్నాడు కాని ఆమె అంత సీరియస్ గా తీసుకుందను కోలేదు. తను మాట్లాడినా ఆమె మాట్లాడక పోయేసరికి తన అహం దెబ్బతింది. ఆమెకేనా పౌరుషం .. అనుకుని తనూ ఊరుకున్నాడు. కాని గలగలా మాటలతో సందడిగా ఉండే ఇంట్లో కేవలం ఆమె గాజుల గలగలలు, మువ్వల చిరుసందడి తప్ప మాటలే లేని ఆ మౌనం ఇంత భయంకరంగా ఉంటుందనుకోలేదు. అసలు ఇంట్లో ఉండాలనిపించడం లేదు. కానీ కొత్తగా ట్రాన్స్ఫర్ అయి వచ్చిన ఊరు. డ్యూటీ అయిపోగానే ఎప్పుడెప్పుడు ఆమె ఒళ్లో వాలదామా అని వచ్చే తాను, ఇప్పుడు కొత్తగా ఎవరింటికో పోవడము చేయలేక పోతున్నాడు. అలాగని పార్క్ లోనో, గుళ్ళోనో ఎంత సేపని కూర్చుంటాడు. పైగా ఆఫీస్ నుండి అంతా ఆత్రంగా ఎప్పుడెప్పుడు ఇల్లు చేరదామా అని వెళుతుంటే తానేమో గమ్యం మరిచిన బాటసారిలా ఎలా ఉండగలడు? పైగా కొత్తగా పెళ్ళయి రెండేళ్ళు రెండు క్షణాలల గడిచి ఇప్పుడీ పంతం ఏమిటో ...ఈవేళ ఆఫీస్ కాన్ఫరెన్స్ లో 'బ్రేకింగ్ ది ఐస్' తనే చేసాడు. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. కాని ఇంట్లో గెలవలేదు.

ఇప్పుడు తను గుడికి వెళ్ళడం లేదు. అక్షయని వచ్చినట్లుంది . దేవుడి గదిలో ఆ మంగళ హారతి పెట్టి అలాగే రోజు వారి పూజ చేస్తోంది. 'కమలా కుచ చూచుక కుంకుమతో నియతారుని తాతుల నీలతనో.....' పాటల్లో కూడా అలవోకగా వినిపించే శృంగారం. మరి నవరసాల్లో ఒకటి కదా... ఎంతో ప్రాధాన్యం ఉన్న రసం. ఇవాల్టికి కనీసం నాలుగు రోజులే అయినా తనకు నాలుగు యుగాలయినట్లుంది. ఆఫీస్ లో కూడా మనస్సు ఏటో పోతోంది. ఎ పనీ చక్కగా చేయలేక పోతున్నాడు. ఎన్నడూ లేనిది చాలా ఇబ్బంది కర పరిస్థితుల్లో పడుతున్నాడు. ఎంత ప్రయత్నించినా మనస్సులో ఎదో వెలితి.... ఏమిటీ వింత..పెళ్లి కాక ముందు ఒక్కడే లేడా ..అప్పుడిలా ఏమీ అనిపించలేదే... కానీ ఇప్పుడు ఎందుకిలా ..... ఏమిటీ మాయ... ఆలోచనల్లోనే అన్యమనస్కంగా తయారై ఆఫీస్ కెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఎదో నిద్రలో వేసినట్లుగా ఆమె నడుం పై చేయి వేసాడు. గుండె జల్లుమంది అక్షయనికి.. ఎంతో అపురూపంగా ముద్దిచ్చుకోవాలనుకుంది. అలాగే తనకూ తెలియనట్లు ఉండాలనిపించింది. నిద్రలో జరిగినట్లు అతని వెచ్చని పరిష్వంగం లో బందీ కావాలనిపించింది. మనస్సు తీయగా మూలిగింది. వంట్లో వెచ్చని ఆవిర్లు వస్తున్నాయి. కాని వెంటనే మృదువుగా తన చేయితో అతని చేయిని పక్కకు జరిపి దూరంగా అంటకుండా పడుకుంది. ఇక ఆ రాత్రంతా కాళ రాత్రే అయ్యింది అతనికి. ఆటను అటూ ఇటూ బోర్లడం ఆమెకు తెలుస్తూనే ఉంది. తనకు తెలవాలనే అతను అలా

చేస్తున్నాడా అని కూడా అనుకుంది. ఇతిహాస్ కి మనసు మనసులో లేదు. అతను బ్రాంచ్ మేనేజర్ ... ఇప్పటి వరకు ఏంతో మంచి గా పేరు తెచ్చుకున్న అతను గత పది రోజులుగా ఎందుకో ప్రాడక్ట్స్ మార్కెటింగ్ చేయలేక పై అధికారులతో తిట్లు తింటున్నాడు. కనీసం ఈ విషయం భార్య మాట్లాడక పోవడం తో పంచుకోలేక ఇంట్లో, బయట మనశ్శాంతి లేక కుమిలి పోతున్నాడు. అలా నిద్ర రాక ఎ తెల్లవారగట్లనో నిద్ర లోకి జారుకున్నాడు.

తెల్లవారి గుడిలో తిరుప్పావై చదివాక అయ్యగారు అందరి గోత్ర నామాలు చదువుతున్నాడు. మరో అయ్యగారు గుడి చుట్టూ తిరుగుతూ అష్టదిక్పాలకులకు, స్వామివారికి , అమ్మగారికి నైవేద్యం పెడుతున్నారు. సాధారణంగా ఆ సమయంలో ఖాళీగా కూర్చున్న అందరూ ఒకరితో ఒకరు ముచ్చటించుకుంటూ ఉంటారు.

'ఎంతైనా నువ్వు అదృష్టవంతురాలివమ్మా... బంగారం లాంటి మొగుడు దొరికాడు. ఎ జన్మ లో చేసుకున్న అదృష్టమో ...అదే నా అల్లుడు ఉన్నాడు ... నా కూతురును రాచి రంపాన పెడుతున్నాడు. కూర్చున్నా తప్పే నిల్చున్నా తప్పే ... '

'ఎందుకాంటీ ...'

'ప్రతీ చిన్న విషయానికీ తప్పు తీస్తాడు.. ఇంట్లో అన్ని పనులు చేయాలి మళ్ళీ ఆఫీస్ కి హడావుడిగా పరుగెత్తాలి.. ఇటున్న పుల్ల తీసి అటు పెట్టడు. ....'

' అలాగయితే ఎలా.... ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్నపుడు బాధ్యతలు కూడా పంచుకోవాలి...కదా.... ఈసారి ఉద్యోగం చేయను అనమనండి ' అంది. ఇంతలో ప్రసాద వినియోగం అయిపోవడంతో హారతి పట్టుకున్నారంతా.

ఆ రాత్రి ఇ తిహాస్ కి ఆరోగ్యం బాగా లేనట్లుంది. అతి కష్టం పై కొంచెం తిని ఎదో తిన్నాననిపించాడు. గమనించినా సానుభూతి పొందడానికి నాటకమేమో అని బింకంగా ఉండి పోయింది. తెల్లవారి ఎప్పటిలా లేచి గుడి కెళ్ళి పోయింది. పూజ చేసి కాఫీ తయారు చేసినా ఎప్పటికీ లేచి తయారయ్యే అతను ఇంకా లేవక పోవడం తో బెడ్ రూమ్ లోకి వెళ్ళింది. నిండుగా ముసుగు తన్ని పడుకుని ఉన్నాడు. రేడియో సౌండ్ పెంచింది అతను లేస్తాడని..ఊహు ..కప్పు పెద్ద శబ్దం చేస్తూ టేబిల్ పై పెట్టింది. ఆహా.. ఇక తప్పదన్నట్లు దుప్పటి తీసింది. చలికి వణుకు తున్నాడు . నుదుటి పై చేయి వేసింది. పెనంలా కాలుతోంది. పెళ్ళయిన కొత్తలో అత్తయ్య అన్న మాటలు గుర్తొచ్చాయి ఆమెకు. వాడికి విపరీతమైన మానసిక వేదన ఉంటె తప్ప జ్వరం రాదు. ఇప్పటి వరకు ' వాళ్ళ నాన్న పోయినప్పుడు, వాళ్ళ అక్క పెళ్లి అయినప్పుడు మాత్రమె జ్వరం వచ్చింది. నీ సహచర్యం లో ఇక ఎప్పటికీ రాదనీ అనుకుంటాను. జాగ్రత్త తల్లీ' అంది.

'ఏమండీ... బాగా జ్వరం వచ్చినట్లుంది..లేవండి....మొహం కడుక్కుని టాబ్లెట్ వేసుకుందురు గాని ..' అంది ఆదుర్దాగా. కాని ఉలుకు పలుకు లేదు.. అసలు సోయిలో లేడు. భయం వేసింది ఆమెకు. ఛీ తానెంత కర్కశంగా ప్రవర్తించింది. ఆ బెంగ తోనే ఇలా అయ్యాడా... ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. ఏమీ తోచలేదు. ఇంతక ముందు తనకు జ్వరం వచ్చి నప్పుడు భర్త ఫోన్ చేసిన డాక్టర్ కి ఫోన్ చేసింది, ఇలా కదల లేకుండా ఉన్నాడని, ఇంటికే రమ్మని చెప్పింది. డాక్టర్ వచ్చి జ్వరం చూసి మందులిచ్చి, భయపడాల్సింది లేదని చెప్పి వెళ్ళాడు. ఆఫీస్ కి ఫోన్ చేసి ఇతిహాస్ రావట్లేదని చెప్పింది . టాబ్లెట్స్ తో కొంచెం సేపు పడుకున్నాక జ్వరం తగ్గింది. అప్పటి వరకు నీళ్ళల్లో బట్ట ముంచి ఒళ్ళంతా తుడిచింది. కొంచెం జావా తాగించింది. 'సారీ ...ఇబ్బంది పెడుతున్నాను...' అన్నాడు.

'సారీ నండి...నా మూర్ఖత్వంతో మిమల్ని బాధ పెట్టాను..ఇంకా అలా అనకండి...'

ఏడుస్తూ అంటుంటే తలు పు తట్టిన శబ్దం వినిపించడం తో కళ్ళు తుడుచు కుని తలుపు తెరిచింది.

ఎవరో అపరిచిత దంపతులు. ఆతని చేతికి, తలకు బాండేజీ కట్టు కట్టి ఉంది. ఇవాళ, రేపు ఇలా వచ్చి మోసం చేస్తున్నారని వినింది. అందుకే భయంతో తలుపు వేయబోయింది. 'నమస్కారమమ్మా.... సార్ లేరా..' ఏంతో వినయంగా అడిగిన వారి ప్రశ్నకు ,'మౌనంగా తలూపుతూ ,'మీరు ..' అంది .

'నా పేరు శంకర్ ... మొన్న ఇరవై అయిదవ తేదీ రోజున సార్ గనక నన్ను కాపాడక పొతే ఈ రోజు నా పెద్ద కర్మ కూడా అయి ఉండే దమ్మా ...ఆరోజు ఎవరో టూ వీలర్ పై వెళుతున్న నన్ను వెనక నుండి డీ కొట్టి వెళ్లి పోయారు. చాలా రక్తం పోయింది. 10 0 కి ఫోన్ చేసారు కాని అది చాలా దూరం నుండి రావాల్సి ఉండే ఇంకా రాలేదు. సార్ వెంటనే ఆటోలో హాస్పిటల్ కి తీసుకెళ్ళాడు. అక్కడ 'అప్పటికే చాలా రక్తం పోయింది. వెంటనే రక్తం కావాలన్నారు'. సార్ రక్తం కలవడంతో ఆయనే ఇచ్చారు... డాక్టర్స్, సమయానికి ఆయన తీసుకురాకపోయినా, రక్తం దొరకక పోయినా బ్రతకడం కష్టం అయ్యేది అన్నారు. పేదవాడి నయినా నాకు ప్రాణ బిక్ష పెట్టిన ఆయనకు కనీసం కృతజ్ఞత తెలపడం నా కనీస ధర్మం. అందుకే డిశ్చార్జ్ కాగానే ఇటే వస్తున్నా.....' అన్నాడతను.

అంటే తన పుట్టిన రోజున ఆయన ఆలస్యంగా రావడానికి ఇదే కారణమా ... అందుకే ఎంతో చెప్పడానికి ట్రై చేసాడు. తనే కోపంతో వినిపించుకోలేదు. బాగా అలసినట్లు కూడా కనిపించాడు. చ..అంత ఆవేశం రావడానికి తన పుట్టిన రోజు ఏమైనా శుభప్రదమైన రోజా... ఒకరి ప్రాణం నిలబెట్టాడు... చిన్న విషయానికి ఎంత కష్ట పెట్టింది.....ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. మాటలు వినబడుతుంటే , అలికిడికి బయట కొచ్చాడతను.

ఇద్దరూ వద్దంటుంటే వినిపించుకోకుండా పళ్ళ బుట్ట అక్కడ పెట్టి, వద్దంటున్నా కాళ్ళు మొక్కి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళగానే ఉప్పెనలా చుట్టేసింది 'నన్ను క్షమించండి' అంటూ అక్షయని ఇతిహాస్ ని. ఎన్నో జన్మల నుండి దూరమయినట్లు , అపురూప పెన్నిధి దొరికినట్లు , విడి వడితే ఇక మళ్ళీ దొరకదన్నట్లు, ఎక్కడ చేజారుతుందో నన్నట్లు ఆమె పరిష్వంగ సుఖాన్ని ఆస్వాదిస్తూ అలా ఉండి పోయాడు. దూరంగా జే గంటలు మృదు మధురంగా 'శుభం అంటూ మోగాయి.

'నన్ను క్షమించండి... ఎంత పని చేసాను..పాపిష్టి దాన్ని...నన్ను క్షమించకండి..నన్ను కొట్టండి....' ఉన్మాదంగా అతని అరచేయితో తన చెంపలపై కొట్టుకుంటుంటే...'చ... మన మధ్య క్షమాపణ లేంటి...బంగారం..నువ్వు లేక నేను ఉండలేను తెలుసా... నువ్వు నా ప్రాణం..పైకి డైలాగ్స్ చెప్పడం నాకు రాదేమో కాని నా ప్రాణం కన్నా మిన్నగా నిన్ను ప్రేమిస్తాను...' ఆర్తిగా అ న్నాడుఆమె ఏద లోతుల్లో తల దాచుకుంటూ .

'పిచ్చీ ..ఆ బాధతోనే ఇంత జ్వరం తెచ్చుకున్నావా.... '

'నిజంగా ఎంత పిచ్చివాన్నయిపోయానో తెలుసా... ఇటు నీ సహచర్యం లేదు..అటు ఆఫీస్ లో అప్పటి నుండి మార్కెటింగ్ చాలా తగ్గింది ..' అన్నాడు

'అవునా... ' అంటూ అతని సాధక బాధహకాలన్నీ అతని గాఢ పరిష్వంగాన్ని వదలకుండా అడుగుతూనే కొన్ని సూచనలు చేసింది.... అతని జ్వరం దెబ్బకు తగ్గింది. ఆ రోజంతా ఇద్దరూ మన్మధ సామ్రాజ్యంలో వీర విహారం చేసారు. ఇన్ని రోజుల విరహానికి వడ్డీ తో సహా పన్ను చెల్లించారు.

వారం తర్వాతఆఫీస్ లో మళ్ళీ పుంజుకున్న జోరు ను చూసి,' ఎం మాయ చేసారు సర్....' అన్నారంతా.

అక్కడ నవ్వి ఊరకున్న అతను 'ఎం మాయ చేసావే...' అంటూ ఆమెనే అడిగాడు .

'ఏదైనా ఇంట్లో బావుంటేనే మీకు బయట కూడా బావుండేది...మమ్మల్ని కాదని మీరు ఎక్కడా మనలేరు..ఇంట్లో నా ద్వారా మీకు దొరికిన ప్రశాంతత ఎందులోనూ రాదు..ఇది ఎన్నో పరిశోధనల ద్వారా కనుక్కున్నారు... అందుకే భార్య తో శృంగారం లో పాల్గొనే వాళ్ళల్లో ఆరోగ్యం ఎక్కువ అని నిరూపించ బడింది... అదే రహస్యం... అదే మాయ..' కిలా కిలా నవ్వింది అతని మనసు దోచేలా అతని అల్లుకుపోతూ.. వారి మధ్య తనకు చోటివ్వనందుకు అలిగి గాలి కూడా వెళ్ళిపోయింది. వారి శృంగారాన్ని చూసి సిగ్గుపడి చంద్రుడు మబ్బుల చాటుకు వెళ్ళిపోయాడు.





తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
The Annual Family
Picnic
in person
Admission FREE
Registration MUST
పచ్చని ప్రకృతి ప్రాంగణంలో, పసందైన వేసవి వనభోజనాలకు
మీకిదే మా ఆహ్వానం - మీరాక మాకెంతో సంతోషం
Date
Sunday, August 8, 2021
11 am onwards
Place
Burke's Park
Washington Road Sayreville, NJ
FOOD
GAMES
RAFFLE
FUN FILLED FITNESS
by HARINI POTLURI
Certified Zumba and Bollywood Fitness Instructor
హుషారుగా ఆడుకుందాం
శ్రావ్యంగా పాడుకుందాం
ఆనందం ఆహ్లాదం పంచుకుందాం
Win Prizes
Register for the event at : www.tfasnj.org
For additional information:
Sreedevi Jagarlamudi 732-470-7055
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Srinivas Cheruvu 732-447-6686
Jyothi Gandi 732-208-9599
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503
Sponsors:
NEW YORK LIFE
Balaji Flowers Usa
GODAVARI USA | CANADA
VAJR JEWELS
SOUTHERN SPICE
Srilatha Collections LLP | Website: srilathacollections.com
BIRYANI JUNCTION
Media Support :
mana tv HD
TV5 NEWS
TVASIA TELUGU
TELUGU NRI RADIO
TV9
GNN
SAKSHI TV
US 1 TELEVISION
GK TV
SUNRISE TV

# ఘనుడు నాన్న - త్యాగధనుడు నాన్న

డాక్టర్ ఎమ్.సుగుణ రావు

అమ్మ తిడితే వచ్చిన ఏడుపు, నాన్న బుజ్జగింపే పానుపు
పరీక్షలంటే కలిగిన భయం, నాన్న ధైర్య వచనాలే అభయం
బేతాళ కథలు చెప్పి, పని చేయడంలో
పట్టు వదలని విక్రమార్కుడిని చేస్తాడు
వైకుంఠపాళి ఆడించి బ్రతుకులో గెలుపు నిచ్చెనలు ఎక్కిస్తాడు
పాడు అలవాట్ల పాముల పడగ కాటు వేయకుండా మంత్రం వేస్తాడు
చిన్నప్పుడు నాన్న చేయి పట్టుకుని వేసిన తప్పటడుగులు
పెద్దయ్యాక వేయనియ్యవు, ఏ 'తప్పు'టడుగులు

ప్రతీ ఆడపిల్లకు భర్తలాంటి రాజకుమారుడు రాకపోవచ్చును
ప్రతీ ఆడపిల్లకు నాన్నే ఒక రాజకుమారుడు

ప్రపంచానికి నాన్న ఒక 'జీరో' అయినా
పిల్లలకు మాత్రం ఆయనే ఒక 'హీరో'
బాల్యం మసకబారకుండా నాన్న ఆటల
వెలుగు బాటలో నడిపిస్తాడు
అపజయాలు వచ్చినా కృంగిపోనీయని
ఆశల బావుటా ఎగరవేయిస్తాడు
నాన్న విలువ వెలకట్టలేనిదని
నాన్నయ్యేకే తెలుస్తుంది
అప్పటికి నాన్న ఒక జ్ఞాపకమై
బతుకు పుస్తకంలో నెమలీకై
మిగులుతుంది.

# మృత్యుంజయులు

నామని సుజనా దేవి

ఎవరన్నారు ....నేనిప్పుడు జీవచ్ఛవాన్నని ...?
చైతన్యమైన చేతనావస్థ నుండి అచేతనావస్థ కు
సుషుప్తి నుండి గాఢ సుషుప్తి కి
క్రియాశీలత నుండి అక్రియాశీలత కు
ఇహలోకం నుండి పరలోకానికి
చేరుకుంటున్నజీవచ్ఛవాన్నని .....?సగటు మానవ జీవితం కన్నా
ఎక్కువ రెట్లు బతికే మృత్యుంజయుణ్ణిప్పుడు

కొడిగడుతున్న మరో ప్రాణ దీపాన్ని వెలిగించగలను
కొన ఊపిరితో ఉన్న మరో జీవికి ఊపిరందించ గలను
శ్వాస కోల్పోతున్న మనిషికి శ్వాసనందించ గలను

నిర్వీర్యమవుతున్న కుటుంబంలో చైతన్య దీప్తవ్వగలను
ప్రపంచం చూడలేని వారికి సప్త వర్ణాల లోకాన్నందివ్వగలను
మరణ శయ్యపై నున్నవారికి జీవన జ్యోతినవ్వగలను
అంధ కారమవుతున్న ఇంటిలో వెన్నెల వెలుగవ్వగలను

నను కన్నవారు కన్నీళ్ళతో వీడ్కోలు చెబుతున్నా
మరొకర్ని కన్నవాళ్ళ కళ్ళల్లో కాంతి రేఖలు పూయించ గలను
బతకాలనే ఆశకు ఈ దేహం సహకరించకున్నా
మరో దేహాన్ని వేదికగా చేసుకుని
శుష్కించిన ప్రాణాన్ని చిగురింపజేయగలను

శూన్యమవుతున్న జీవితానికి అనంతమవ్వగలను
అజరామరంగా జీవించగలను
ఆచంద్రతారార్కం వెలగగలను

అవును ...నేనిప్పుడు అవయవ దానంతో
మృత్యువు ను జయించిన మృత్యుంజయుణ్ణి
కొడిగడుతున్న దీపానికి ఊపిరందించి
ప్రాణం పోసే అపరబ్రహ్మ ను.
జీవితపు చివరిక్షణం లోని నిస్సహాయ స్థితి లో కూడా
అత్యంత విలువైన అవయవ దానాన్ని చేయగల
అపరశిబి చక్రవర్తి ని . అపర దాన కర్ణుడి ని ..
నేను మృత్యుంజ యుడిని .



తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
TFAS
TENNIS
TOURNAMENT
TOURNAMENT DATE :
September 11th & 12th
Location:
PRINCETON AREA
Singles: $10 per person
Doubles: $10 per person ($20 per team)
Registration Last Date :
September 8th
CATEGORIES:
• Boys & Girls
Seniors (13 yrs & above)
Juniors (12 yrs and below)
• Open Men's Singles & Doubles
• Seniors doubles (above 55 yrs)
Rules & Registration @ http://www.tfasnj.org
For more details Contact:
Rama Krishna Seethala, rseethala@gmail.com
Naren Bandaru, 973-820-3260, naren493@gmail.com
Vijay Saradhi Nara, 917-371-8139, vijaynaramail.com
Sreedevi Jagarlamudi 732-470-7055
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Srinivas Cheruvu 732-447-6686
Jyothi Gandi 732-208-9599
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503


తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
TFAS
CRICKET
TOURNAMENT 2021
TOURNAMENT DATE :
September 18 th & September 19th
Last date to Register:
September 4th
Registration Fee:
$150 per team
Rules & Registration @
www.tfasnj.org
Location:
PLAINSBORO
Cash Prizes
For more details Contact:
Rama Krishna Seethala : rseethala@gmail.com
Sai Naduri: 732-648-3577, saibaban@gmail.com
Sreedevi Jagarlamudi 732-470-7055
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Srinivas Cheruvu 732-447-6686
Jyothi Gandi 732-208-9599
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503


తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
TFAS
BADMINTON
Tournaments
(SINGLE & DOUBLES) 2021
TOURNAMENT DATE :
October 10 th
Location:
International Badminton Courts (IBC),
Edison
Last date to Register: October 5th
Rules & Registration @ www.tfasnj.org
Registration Fee: Singles: $20 per person
Doubles: $20 per person ($40 per team)
For more details Contact:
Rama Krishna Seethala, rseethala@gmail.com
Dasaratha Reddy, 732-983-8418, dasaratharamareddy1982@gmail. com
Sreedevi Jagarlamudi 732-470-7055
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Srinivas Cheruvu 732-447-6686
Jyothi Gandi 732-208-9599
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503


తెలుగు కళా సమితి
Telugu Fine Arts Society
A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org
New Jersey
TFAS
VOLLEYBALL
TOURNAMENTS
TOURNAMENT DATES :
October 16th & 17 th
Location:
Plainsboro
Last date to Register:
October 11th
Rules & Registration @ www.tfasnj.org
Registration Fee: $100 per team
CASH PRIZES
For more details Contact:
Rama Krishna Seethala, rseethala@gmail.com
Raju Gadiraju, 609-240-2745, sgadiraj@yahoo.com
Sreedevi Jagarlamudi 732-470-7055
Bindu Yalamanchili 908-240-3167
Anuradha Para 201-312-5335
Srinivas Cheruvu 732-447-6686
Jyothi Gandi 732-208-9599
Anuradha Dasari 908-907-1502
Ravi Annadanam 917-355-5503

# నేను అనాథను కాను
## శింగరాజు శ్రీనివాసరావు

ఎంత జాగ్రత్తగా వున్నా ఎలా కబళించిందో నా దేహాన్ని కరోనా మహమ్మారి నాకే అర్థం కాలేదు. బహుశా వయసు ప్రభావమేమో మరి. డెబ్బైయవ పడిలో నన్ను ఆసుపత్రి పాలు చేసింది. వారం క్రితం కొంచెం నలతగా అనిపించింది. మరుసటిరోజు విపరీతమైన జ్వరం. భయపడ్డాడేమో నా కొడుకు సుశాంత్ నాకు కోవిడ్ పరీక్ష చేయించాడు. రాపిడ్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చింది. అంతే, ప్రభుత్వ ఆసుపత్రికి వివరం అందించాడు. ఒక గంట తరువాత అక్కడ పడకలు ఖాళీ లేవని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చుకోమన్నారు. అందుబాటులో ఉన్న అన్ని ఆసుపత్రులకు ఫోను చేశాడు వాడు. ఎట్టకేలకు ఒక ఆసుపత్రి వారు అంగీకారం తెలిపి అంబులెన్స్ పంపారు. మెడికల్ ఇన్స్యూరెన్స్ కవర్ అయేలా చూస్తామని కూడ చెప్పారు. పనిలో పనిగా నా కొడుకుకు, కోడలుకు, ఆఖరుకు మనవడికి కూడ కోవిడ్ పరీక్షలు చేసి వాళ్ళను వెళ్ళిపొమ్మన్నారు. రిజల్టు రేపు చెబుతామన్నారు.

ఏవో కాగితాలు నాకు ఇచ్చి సంతకాలు పెట్టమన్నారు. నా వద్ద నుంచి కార్డు కూడ తీసుకుని నన్ను ఒక గదిలోకి తీసుకెళ్ళారు. చిన్నగది అది. అందులోనే అన్ని వసతులు ఉన్నాయి. అప్పుడు నాకు అర్థమయింది అది ఐసొలేషన్(ఏకాంతవాసము ) గదియని. ప్రైవేటు ఆసుపత్రి కనుక నాకు ఒక్కడికే ఒక గది కేటాయించారు. చాలా ప్రత్యేకంగా అనిపించింది నాకు. అదే ప్రభుత్వ ఆసుపత్రిలో అయితే కనీసం గదికి నలుగురిని ఉంచేవారు. ఇప్పుడు నాకన్నీ ప్రత్యేకం. గొప్పగా అనిపించింది నా మధ్య తరగతి బ్రతుకుకు. బడిపంతులుగా పదవీ విరమణ చేసిన నాకు, నా కొడుకు సాఫ్ట్ వేర్ ఇంజనీరు కావడం వలననూ, ఈ మధ్యనే అమెరికాలో నాలుగు సంవత్సరాలు ఉండి, నాలుగు రాళ్ళు సంపాదించడం వలననూ ఈ వైభోగం దక్కింది. నా అదృష్టం ఏమిటంటే వాడికి అమెరికాలో ప్రాజెక్టు అయిపోవడం వలన పోయిన నెలలోనే ఇక్కడికి వచ్చాడు. మరల అమెరికా వెళ్ళాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. వాడు అక్కడే ఉండి వుంటే ఈ ఒంటరి ముసలి ప్రాణికి ప్రభుత్వ ఆసుపత్రే గతి అయ్యేది. నా ఆలోచనలు ఛేదిస్తూ వచ్చింది నర్సు కళ్ళు తప్ప ఇంకేమీ కనపడకుండా దుస్తులు ధరించి.

"మీకిప్పుడు ఇంజక్షను చేసి మందులు ఇచ్చి వెళతాను. క్రమం తప్పకుండా చెప్పినట్లు వేసుకోండి."చెప్పి ఇంజక్షను చేసింది.

"అమ్మా భోజనం మా వాళ్ళు తెస్తారా"అడిగాను.

"లేదండి. అన్నీ ఇక్కడే మీకు. మీకు ఇంటి నుంచి భోజనాలు గానీ, మిమ్మల్ని చూడడానికి మనుషులు గానీ ఎవరూ రారు. పదిహేను రోజుల తరువాత మీకు నెగటివ్ వస్తేనే మీరు, మీవాళ్ళను కలిసేది"టకటకా చెప్పి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను. అంటే ఇక్కడ నా చావు నేను చావాలన్న మాట. ఎవరూ నాకోసం రారన్నమాట. బోలెడంత దిగులువేసింది. చిన్నప్పుడు మా తాతయ్యకు బాగులేక-పోతే.... మనసు గతంలోకి వెళ్ళింది.

★★★★★★★★★★★

అప్పుడు నాకు పదిహేను సంవత్సరాలు. తాతయ్యకు బాగులేదని టెలిగ్రాం వచ్చింది. అంతే హడావుడిగా నాన్న, అమ్మ బయలుదేరుతూ సెలవులు కావడంతో నన్నూ, చెల్లిని కూడ తీసుకెళ్ళారు మేముండే ఒంగోలుకు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న మా పల్లెకు. అక్కడ మా తాతగారు కరణం గా పనిచేసేవారు. మేము వెళ్ళేసరికి అప్పటికే మా తాతయ్య తమ్ముళ్ళు నలుగురూ, వారి భార్యాపిల్లలు, మా తాతయ్య పిల్లలు అయిదుగురు పిల్లలతో సహా వచ్చి ఉన్నారు.

"ఒరేయ్ జగన్నాథం వచ్చావుట్రా. అదేం మాయదారి జబ్బురా మీనాన్నకే రావాలా. గొప్ప గొప్ప వాళ్ళకే వస్తుందట. ఇప్పుడు మీ నాన్నకు వచ్చిందిరా "అంటూ బావురుమన్నది బామ్మ మా నాన్నను చుట్టుకుని.

"ఏడవకే అమ్మా. అసలేమయిందిరా అన్నయ్యా"అని అడిగాడు నాన్న, మా పెదనాన్నని.

"ఏంలేదురా అది చిన్న పుండులేరా. అమ్మ ఊరికే కంగారుపడుతుంది. నువ్వు వెళ్ళవే. నాన్న పిలుస్తున్నాడు"అని బామ్మను పంపి,"అదేరా రాచపుండు అంటారే. అదే కాన్సర్. కడుపులో పేగుల్లో వచ్చినట్లుంది. మొన్న ఒకరోజు నోట్లోనుంచి కొద్దిగా రక్తం వచ్చిందట. మన ఆచారి గారు చూసి భయమేమి లేదు. మందులు వాడితే తగ్గుతుంది అన్నాడు. పోనీ హైదరాబాదు పోదామంటే నాన్న ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఉన్నా పోయినా నలుగురి మధ్యే తప్ప, ఆ ఉత్కృష్టం నాకొద్దని భీష్మించుకున్నాడు. చేసేదిలేక ఆయన మందులే వాడదామనుకుంటున్నాం. రక్తం చూసి భయపడి అమ్మ అందరినీ పిలిపించింది. నిన్ను వద్దని చెప్పాము. వింటేగా"అంటూ తాతయ్య మంచం వైపుకు నడిచారిద్దరూ.

"వచ్చావుట్రా జగ్గూ. పిల్లలు కూడ వచ్చారా. అంతా హడావుడిరా మీ అమ్మది. చిన్న విషయానికే బెంబేలు పడిపోయి అందరినీ పిలిపించింది"నొచ్చుకున్నాడు తాతయ్య.

"పిల్లలకు సెలవులే నాన్న. అందరం వచ్చాము. అమ్మ మంచిపనే చేసింది. నలుగురం ఇక్కడే వుంటే మీకు ఆరోగ్యం బాగలేదన్న ఆలోచనే రాదు"అన్నాడు నాన్న.

"అసలు అన్నయ్యకేమవుతుందిరా. ఉక్కు శరీరం. ఎవడి దిష్టో తగిలింది. అంతే. వారం తిరిగేసరికి గుర్రంలా పరిగెత్తడూ"అంటూ మా తాత భుజాన్ని తట్టాడు మా చినతాతయ్య.

అలా అందరూ తలా ఒకరకంగా ధైర్యం చెబుతుంటే మా తాతయ్య జబ్బున్న సంగతే మరచి అందరితో పరాచికలాడటం

మొదలుపెట్టాడు. అందరి నవ్వులతో ఇల్లంతా మారుమ్రోగిపోయింది. వారం రోజులు ఉండి మేము బయలుదేరబోతుంటే మా పెదనాన్న నన్ను, నాన్నను పిలిచాడు.

"ఒరేయ్ జగన్నాధం. నీకో నిజం చెప్పాలి. నాన్నగారు ఇంకో నెలరోజుల కంటే ఎక్కువ కాలం బ్రతకరని వైద్యుడు చెప్పారు. తొంభై యెండ్ల వయసులో ఏ మందులూ సరిగా పనిచేయవని, ఆయనను సంతోషంగా ఉంచడమే మనం ఆయనకు చేయగల వైద్యమని చెప్పారు. నాన్నగారికి వాసు అంటే చాలా ఇష్టం. ఆయనకు వీడు కనిపిస్తుంటే కొంచెం హుషారుగా ఉంటాడు. నువ్వు, అమ్మాయి వెళ్ళినా పిల్లలను మాత్రం ఉంచి వెళ్ళండి ఎలాగూ సెలవులే కదా"నాన్నను అర్థించాడు పెదనాన్న.
నాన్న నావైపు చూశాడు.

తాతయ్య బ్రతకడని తెలిశాక నాకు చాలా దిగులు వేసింది. కళ్ళ నీళ్ళు కుక్కుకుని సరేనని తల ఊపాను.

ఆ రోజునుంచి తాతయ్య దగ్గరే ఎక్కువగా ఉండేవాడిని. ఆయనను విచారించడానికి ఊర్లోనే కాదు, పక్క ఊరినుంచి కూడ వచ్చి పలకరించి పోయేవారు.

ఒకరోజు ఆ కాలుడు పిలిచాడేమో, నా తొడల మీద తలపెట్టుకుని తాతయ్య తన ప్రాణం వదిలాడు. అందరూ భోరుమన్నారు. ఊళ్ళకు వెళ్ళిన బంధువులంతా బిలబిలమంటూ వాలిపోయారు. కంటతడి పెట్టని వారు లేరు. తాతయ్య శవాన్ని తీసుకువెళుతుంటే వెంట నడిచే జనాన్ని చూస్తుంటే, అది అంత్యక్రియలాగ లేదు. ఏ దేవుడి ఊరేగింపేమో అన్నట్లుగా తోచింది నాకు. ఎంత ఆస్తులున్నా ఏవీ మనతోటి రావు. ఒక్క మనిషి చూపే ప్రేమ తప్ప. కుల, మత బేధం లేకుండా అందరూ వెన్నంటి నడిచారు. అంతకంటే మనిషికి ఏంకావాలి అనిపించింది నాకు. ఆ దృశ్యం నేటికీ కళ్ళముందు కదులుతూనే వుంది.

ఆఖరుకు నాన్నగారు కాలం చేసినప్పుడు పట్టుమని పదిమంది రాలేదు. నాగరికత పెరిగే కొలదీ మనిషి మనసు మరీ కురచగా మారిపోయిందేమో అనిపించింది.

★★★★★★★★

"సర్. భోజనం"అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. పళ్ళెం అక్కడపెట్టి వెళ్ళిపోయాడతను. పళ్ళెంలో అన్నం, పప్పు, ఉడకబెట్టిన కోడిగుడ్డు, గ్లాసులలో సాంబారు, మంచినీళ్ళు. కాలే కడుపుకు మండే గంజి అన్నట్లుగా ఆబగా తిన్నాను కానీ, రుచి ఏమాత్రం లేదు భోజనంలో.

ఎవరో వచ్చి ల్యాబుకు తీసుకెళ్ళి స్కాన్ తీయించి, మరల గదిలో దించి పోయారు.

నాలుగురోజులూ అదే భోజనం. డాక్టరు వచ్చి చూసిపోవడం, మందులు మింగడం. ఇదీ దినచర్య. పలుకరించే దిక్కే లేదు. రుచి, వాసన లేకపోవడం కరోనా వ్యాధి లక్షణాలట. జ్వరం తగ్గుముఖం పట్టినా, ఊపిరి పీల్చుకోలేక పోవడం మొదలయింది. తట్టుకోలేకపోతున్నాను.

అయిదో రోజు ఎమర్జన్సీ గదిలోకి చేర్చి ఆక్సిజన్ పెట్టారు. కొంచెం ఊపిరాడటం మొదలుపెట్టింది.

సుశాంత్ ను, పిల్లలను చూడాలనిపిస్తున్నది. నాకున్న ఒక్కగానొక్క చెల్లిని చూడాలని మనసు తపించి పోతున్నది. అదే విషయాన్ని డాక్టరు గారు వచ్చినపుడు చెప్పాను.

"చూడండి. ఇది మామూలు జబ్బు కాదు. అంటువ్యాధి. మీ గాలి తగిలితేనే వాళ్ళకు వ్యాపిస్తుంది. అదృష్టవశాత్తు మీతో పాటు మీ ఇంట్లో ఎవరికీ ఈ వ్యాధి సోకలేదు. అలాంటి ఆలోచనలు మానెయ్యండి. మీకు వ్యాధి ముదిరింది. మూత్రపిండాల పనితీరు మందగించింది. కొంచెం మీరు దిగులుపడడం మానేసి మాతో సహకరిస్తే, మరో పది రోజులలో మీరు మీ ఇంటికి వెళ్ళి అందరినీ చూడవచ్చు"అని చెప్పి వెళ్ళిపోయాడు.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నాకు. తాతయ్యకు జబ్బు చేస్తే చుట్టూ మనుషులు. ఆయనను సంతోషపెట్టాలని చూసేవారూ, ఆయన బ్రతకాలని కోరుకునేవారూ ఉండేవారు. ఇప్పుడు విజ్ఞానం పెరిగింది. దానితోపాటు ఒంటరితనం పెరిగింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచం ఒక కుగ్రామమయింది. కానీ మనసుల మధ్య ఖండాంతరాల దూరాన్ని మించిన అంతరాలు. బంధాలు లేవు, అనుబంధాలు లేవు. ఎవరికి వారే.

★★★★

వారం గడిచేసరికి నన్ను వెంటిలేటర్ మీదకు చేర్చారు. మూత్రపిండాలతో పాటు ఊపిరితిత్తులు కూడ సహకరించడం లేదన్నారు. నాకు నాకే తెలుస్తున్నది. ఊపిరి చాలా భారంగా తీసుకుంటున్నాను. ద్రవాహారం మాత్రమే ఇవ్వడంతో శక్తి క్షీణించింది. మాటలు వినిపిస్తున్నాయే గానీ, తిరిగి చెప్పలేక పోతున్నాను. నన్ను పట్టించుకునే నాథుడే లేడు. అలాగే పడివున్నాను. వాళ్ళకు తోచినప్పుడు వచ్చి ఏదో ద్రవం నా నోట్లో పోసి వెళుతున్నారు. మరో వారం గడిచింది. శక్తి పూర్తిగా క్షీణించింది. శ్వాస మీద నియంత్రణ లోపించింది. ఇక రోజులు దగ్గర పడ్డాయని నిర్ణయించుకున్నాను. కళ్ళు తెరవలేకపోతున్నాను. కోమాలోకి పోతున్నానేమోనని అనిపించింది. ఇంతలో ఎవరో మాట్లాడుతున్న శబ్దం లీలగా.

"ఇతను ఇంక బ్రతికే అవకాశం తక్కువ. వెంటిలేటర్ తీస్తే చనిపోతాడు. ఇంతకూ ఇతని బిల్లు ఇతని ఇన్స్యూరెన్స్ కవరేజికి సరిపోతుందా. సరిపోకపోతే వీళ్ళ వాళ్ళకు మిగిలినది కట్టమని చెప్పండి."చెబుతున్నాడు, బహుశా డాక్టరేమో.

"చూశాను సర్. ఇప్పటికి పది లక్షలకు చేరింది. కవరేజి సరిపోతుంది. ఇంకా ఉంచితే అయ్యే ఖర్చు వీళ్ళ వాళ్ళు కట్టవచ్చు, కట్టకపోవచ్చు కదా సర్. మనము శవాన్ని ఎలాగూ ఇవ్వకూడదు

కదా. పైగా మనకు వెంటిలేటర్లు తగినన్ని లేవు. ఇంకో పేషెంటు వస్తే పడకలు కూడ లేవు. పరిస్థితిని బట్టి చూస్తాను సర్"బహుశా అతను చిన్న డాక్టరేమో అనుకున్నాను.

"ఓకె. అలాగే. ఎలాగూ బ్రతకడని తెలిశాక వైద్యం అనవసరం. వెంటిలేటర్ తీసేసి ప్రాణం పోగానే వాళ్ళ వాళ్ళకి కాల్ చేసి, వీడియో కాల్ లో శవాన్ని చూపించి మార్చ్యురీకి పంపండి"అన్నాడు డాక్టర్.
అంటే నాకు కొన ఊపిరి ఉండగానే బలవంతంగా చంపేస్తున్నారు. వళ్ళు గగుర్పొడిచింది నాకు.
నా శవాన్ని కూడ నా వాళ్ళకు అప్పగించరట. ఇన్స్యూరెన్స్ లేదని బలవంతంగా చంపేస్తున్నారు. అంటే మనిషి ప్రాణం కంటే డబ్బే ముఖ్యం. లేచి వాళ్ళను నిలదీయాలనిపించింది.

ఇంతలో ఎవరో నా మూతినుంచి ఆక్సిజను వచ్చే గొట్టాన్ని తొలగించారు. గుండె ఎగిసి ఎగిసి పడుతున్నది. ఇప్పుడు అందరూ ఉన్న అనాథను నేను. ఆరోజు తాతయ్య బ్రతకాలని అందరూ తాపత్రయపడ్డారు. ఆయనను సంతోషంగా ఉంచమని డాక్టరు చెప్పారు. కానీ ఇప్పుడు డాక్టరే ఇక నువ్వు బ్రతకవలసిన అవసరం లేదని బలవంతంగా చావుకు దగ్గర చేస్తున్నారు.

"నేను అనాథను కాను. అనాథను కాను "అని అరవాలనిపించింది. కానీ శక్తి చాలడం లేదు. కళ్ళు చలనాన్ని కోల్పోతున్నాయి. లోకంతో నా బంధం తెగిపోయింది. చేతుల గుప్పిటి తెరుచుకున్నది.

"ఏదో సాధించాలని గుప్పిట బిగించి వచ్చిన మనిషి, ఏదీ సాధించలేనని తెలుసుకుని గుప్పిట తెరుచుకుని పోతాడు. పుట్టేది ఎందుకో తెలియదు. ఎప్పుడు పోతామో తెలియదు. చావు, పుట్టుకల మధ్య నాటకమే జీవితం".

ఇప్పుడు నా శవం అనాథ ప్రేతంలాగ మార్చ్యురీలో .........



# దీనా(పా)వళి

**తవ్వా వెంకయ్య**

మంత్రిగారు ఎంతో బిజీగా ఉన్నా బ్యాంకు మేనేజర్ నమస్కారం పెట్టగానే వందల మంది పార్టీ కార్యకర్తల మధ్య కూడా బ్యాంకు మేనేజర్ విజయభాస్కర్ ను గుర్తుపట్టగలిగాడు. ఏం విజయ భాస్కర్ ఎలా ఉన్నావ్ అన్నాడు మంత్రి. బాగున్నాననే మాట తో పాటు సవినయంగా నమస్కరించాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విజయ భాస్కర్.

మూడు సంవత్సరాల క్రితం మంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి నోచుకున్న గ్రామ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో విజయ భాస్కర్ మొదటినుండి మేనేజర్ గా పనిచేస్తున్నాడు. విషయం ఏమిటో చెప్పమన్నట్లు సైగ చేసాడు మంత్రి. ఏం లేదు సార్, కొత్తపేట కు చెందిన చాలా మంది ప్రజలు లోన్లు కావాలని అడుగుతున్నారు. రైతులకు క్రాప్ లోన్లు సరే కొందరు ఎస్సీ వాళ్ళు సబ్సిడీ లోన్లు కావాలంటున్నారు. మీరు కార్పొరేషన్ తో మాట్లాడితే గాని అది సాధ్యం కాదని చెప్పాడు మేనేజర్.

సరే నేను మాట్లాడతాను ముందు భూమి ఉన్న వాళ్లకు ఇవ్వు తర్వాత మిగిలిన వాళ్ళ సంగతి చూద్దాం. రేపు వారం ఎలాగూ నేను కొత్తపేట కి వస్తాను కదా అప్పుడు మాట్లాడతాను అన్నాడు మంత్రి ఎక్కడికో బయలుదేరుతూ. సరేనని నమస్కారం పెట్టి తన డ్యూటీ కి వెళ్ళిపోయాడు మేనేజర్.

మేనేజర్ బ్యాంకు దగ్గరికి వెళ్ళగానే కొత్తపేట గ్రామంలోని దళితులు ప్రజలు మేనేజర్ దగ్గరికి వెళ్లి లోన్లు గురించి అడిగారు. అలాగే గుడిసెలో ఎన్నో ఏళ్ళుగా ఉంటున్నాము. గాలివానలకు ఎన్నో బాధలు పడుతున్నాము మిద్దెలన్నా మంజూరు చేయించమని ప్రాధేయపడ్డారు. మేనేజర్ తన విధుల పట్ల కఠినాత్ముడే గాని పేదలకు ఏదో ఒకటి చేయాలనే సంకల్పం బుద్ధి ఉన్నవాడు. రేపు వారం మంత్రి గారు మన గ్రామం వస్తున్నారు. అప్పుడు ఆయనను అడగమని సలహా ఇచ్చాడు.

వారం గడిచిన తర్వాత మంత్రి గారు ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల ప్రారంభించడానికి కొత్తపేట కు వచ్చాడు. అందరూ మంత్రిగారిని చుట్టుముట్టారు. వారి వారి సమస్యలు చెప్పుకున్నారు. బ్యాంకు లోను గురించి అడిగారు. మంత్రిగారు మేనేజర్ తో ఈ గ్రామంలో . ఎస్సీ, లందరికీ గొర్రెలకు లోను ఇవ్వచ్చు కదా అన్నాడు. అందుకు మేనేజరు సరేనన్నాడు. పేదలంతా తమకు కూడా మిద్దెలు మంజూరు చేయించాలని వేడుకున్నారు. తాతల కాలం నుండి గుడిసెలలో బ్రతుకుతున్నాము. గాలివాన లకు గుడిసెలు లేచి పోతున్నాయి. మాపై కరుణించాలని ప్రార్థించారు. అందుకు మంత్రి గారు ఇల్లు మంజూరు కావడం అంత సులభం కాదని చెప్పి బయలుదేరారు. మంత్రి బయలుదేరుతుండగా మేనేజర్ విజయ్ భాస్కర్ ఆయన దగ్గరికి వెళ్లి "సార్ ఈ గ్రామ ఎస్సీ ప్రజలు తరతరాలుగా గుడిసెలో ఉన్నారు. మీరు వీరికి ఇల్లు మంజూరు చేస్తే బాగుంటుంది సార్. మిమ్మల్నే నమ్ముకున్నారు అన్నాడు. నిజమే విజయ్ భాస్కర్ ఈ నా కొడుకులకు కొంత గోరోజనం ఎక్కువ. ఈళ్ళు ఇట్టా ఉంటేనే మన మాట వింటారు. ఈ నా కొడుకుల సంగతి నీకు తెల్దు లేవయ్యా అని భుజం తట్టి వెళ్ళాడు.

ఒక్కసారిగా ఆయనలోని నిజస్వరూపం అర్థమై ఏం మాట్లాడలేక నమస్కారం పెట్టి వెనుదిరిగాడు మేనేజర్.

మంత్రిగారి మాట ప్రకారం కొత్తపేటలోని నిరుపేదల అందరికీ గొర్రెలకు లోన్లు మంజూరు చేశాడు మేనేజర్.

వారిలో కొందరు అతి తెలివిని ప్రదర్శించారు. గొర్రెలలోను తెచ్చుకొని గొర్రెలను కొనకుండా వేరే వారి గొర్రెలను చూపించి బ్యాంకు మేనేజర్ ను మోసం చేశారు. ఈ వార్తను గ్రహించిన విజయ్ భాస్కర్ నెల రోజుల తర్వాత గొర్రెల లోను తీసుకున్న వారి ఇంటికి వెళ్లి గొర్రెలు చూపించమన్నాడు. అందుకు వారు ఆ మాట ఈ మాట చెప్పి తప్పించుకో చూశారు. కానీ విజయ భాస్కర్ చాలా గట్టి వాడు. వారి మోసపు ఎత్తుగడలను బయటపెట్టి అలా మోసం చేసిన ఓ ఇరవై మందిపై కేసు పెట్టాడు. బ్యాంకును మోసం చేసి లోను తీసుకున్న నేరానికి వారిని జైలుకు పంపాడు. వారి నుంచి లెక్క మొత్తం బ్యాంకుకు కట్టించాడు. ఈ విషయం మంత్రి దృష్టికి వెళ్లింది. మంత్రికి మేనేజరు జరిగిన విషయం చెప్పాడు. మంత్రి కోపోద్రిక్తుడై అయ్యాడు. నేను ముందే చెప్పలేదా విజయ్ భాస్కర్ ఆ నా కొడుకులు మర్యాదగా బతుకమంటే బతకరు. ఈ నా కొడుకులకు ఆటికాటికి ఉంటేనే మాట వింటారయ్యా అని తాను ఇంతకు ముందు చెప్పిన మాటను బలపరిచాడు. కానీ మేనేజర్ కు మనసులో నిరుపేదలు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఇలా దుర్వినియోగం చేసుకున్నందుకు చాలా బాధపడ్డాడు. మరుసటి రోజు లోను పొందిన దళితులంతా మేనేజర్ దగ్గరికి వెళ్లి తప్పు చేసిన వారి పక్షాన మన్నించమని వేడుకున్నారు. ఎలాగైనా తమకు మిద్దెలు వచ్చేలా చేయమని వేడుకున్నారు.


అదంతా మీ నాయకుల చేతుల్లోనే ఉందని చెప్పాడు మేనేజర్. ఆటికీ మనసు ఉండబట్టలేక తనకు తెలిసిన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి కనుక్కున్నాడు. గ్రామములో అంత మందికి ఒకేసారి ప్రభుత్వ ఇల్లు మంజూరు చేయడం కష్టమని, వారి ఎమ్మెల్యే ప్రభుత్వం నుండి అనుమతి తెచ్చుకుంటే చేయవచ్చు అన్నారు. అలా లేని పక్షంలో ఏదైనా ప్రమాదం జరిగి కొటాలు కాలిపోతేనో లేదా వర్షాలవల్ల కూలిపోతేనో ప్రభుత్వం కలెక్టర్ ద్వారా ఇళ్లు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు.

ఈ విషయాన్ని ప్రజలకు చెప్పలేదు. ఇళ్ల మంజూరులో తానేమీ చేయలేనని మన శాసనసభ్యులే మంత్రిగా ఉన్నారు కదా మీరు వెళ్లి అడగమని ప్రజలను ఏకం చేసి పంపాడు. దళితులంతా వెళ్లి మంత్రిగారిని ఇళ్ల గురించి అడిగితే అందుకు మంత్రిగారు వారికి ఏవేవో మాటలు చెప్పి పంపాడు. కానీ ఇల్లు మంజూరు చేయిస్తానని మాత్రం చెప్పలేదు. ఈ విషయం తెలుసుకున్న బ్యాంకు మేనేజర్ విజయ్ భాస్కర్ ఈ దేశంలో నాయకులు వారిని గెలిపించిన నిరుపేదలకు ఇల్లు కూడా మంజూరు చేయించ లేకపోవడం పట్ల బాధపడ్డాడు.

ఇంటికి వెళ్లాక కూడా రాత్రంతా నిద్ర పట్టలేదు. తాను తన పరిధిలో పేదలకు న్యాయం చేయగల్గినా ఇళ్ల మంజూరు అనేది తన స్థాయికి మించింది. తాను ఏమి చేయగలడో అని బాగా ఆలోచించాడు.

మరుసటి రోజు ఉదయం కొత్తపేట నిరుపేదల అంతా మేనేజర్ దగ్గరికి వచ్చారు . మేనేజర్ విజయ్ భాస్కర్ తన నిస్సహాయతను తెలియజేశాడు. అయినా మన ప్రయత్నం మనం చేద్దాం అన్నాడు. రేపు దీపావళి ఆఫీసుకు సెలవు. దీపావళి అయిపోయాక కలెక్టర్ తో కూడా మాట్లాడదామని వారికి చెప్పి పంపాడు . రాత్రి ఆ ఆలోచనలతోనే నిద్ర పోయాడు. తెల్లారి పేపర్ చూసి ఆశ్చర్యపోయాడు . నిన్న రాత్రి జరిగిన దీపావళి టపాసుల నిప్పులు కొత్తపేటలోని హరిజన కొటాలపై పడడంతో నూట యాభై కొటాలు దగ్ధం. నేడు కలెక్టరు, మంత్రి పరామర్శ అని ఉంది.
ఉదయాన్నే టిఫిన్ కూడా తినకుండా హుటాహుటిన కొత్తపేట వెళ్ళాడు విజయ్ భాస్కర్ ఎటువంటి ప్రాణ నష్టం జరగనందుకు సంతోషపడ్డాడు. బాధితులతో కలసి కలెక్టర్ కోసం మంత్రి కోసం ఎదురు చూస్తున్నాడు.

కలెక్టరు, మంత్రి వచ్చి ఎవరు భయపడవద్దని ప్రభుత్వ మీకు అండగా ఉంటుంది. మీకు అందరికీ ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరు చేస్తుంది. మీరు కొత్త ఇల్లు కట్టుకోవచ్చని ప్రస్తుతానికి మీకు బట్టలు, బియ్యం, ఇంటి సరుకులు ఇస్తున్నామని కొత్తపేట పేద ప్రజలకు ధైర్యం చెప్పారు . అంత మంది జనం లో దూరంగా సుబ్బలక్ష్మమ్మ మాత్రం కలెక్టరు , మంత్రి వెనుక ఉన్న బ్యాంకు మేనేజర్ విజయ్ భాస్కర్ ను చూసి రెండు చేతులూ ఎత్తి నమస్కరించి కన్నీళ్ళు రాల్చింది. మంత్రితో సహా అధికారులు అందరి ముఖాలు పేదల పట్ల తాత్కాలిక జాలి దయ ప్రకటించారు . కానీ విజయ్ భాస్కర్ మొహం మాత్రం తన ఉపాయం విజయలక్ష్మి ద్వారా విజయవంతం అయినందుకు ఆనంద తాండవంలో మునిగింది. వారం రోజుల పాటు కులమతాలకు అతీతంగా కొత్తపేటలోని నిరు పేద ప్రజలకు పూటకు ఒకరు ఒంతున అన్నం చేసి పెట్టారు. నిరాశ్రయులైన దళిత ప్రజలకు అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంగా అండదండగా ఉండడం విశేషం అనిపించింది బ్యాంక్ మేనేజర్ కు
ఈ దీపావళి నరకాసురులనే అనే నాయకుల నుండి నిరుపేదలను రక్షించి వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు మనసులో సంతోష పడ్డాడు.



# కరోనా భయం

M.మహేష్ (7వ తరగతి విద్యార్థి)

కురిసే మంచు లో ఆటలు ఆడే పిల్లలు,
వాళ్లు చిరునవ్వులు చేసే అల్లరి
ఒక్కసారిగా మంచులోనుంచి
పిల్లల ప్రాణాలు తీసింది.

చిరునవ్వులు పోయాయి
అల్లరి పోయింది
ఎక్కడి నుంచి వచ్చింది కరోనా
ఈ కరోనా అందరి జీవితాలను
వాళ్ళ ఆశయాలను దూరం చేస్తుంది

ఇది ఒక భయంకరమైన మృగం లాంటిది
దీనికి జాలి దయ అనేది ఉండవా?
అనే నేను కరోనాని ధైర్యంగా అడుగుతున్నాను
ప్రతి ఇంటి మీద పడి ప్రాణాలు తీస్తున్నావు
వాళ్లు నిన్ను ఏం చేశారని ?
నేను నిన్ను ప్రశ్నిస్తున్నాను..
కరోనా సమాధానం చెప్పు! అని నేను అడుగుతున్నాను
దాని నోటి వెంట మాట రావడం లేదు
సమాధానం ఎక్కడి నుండి వస్తుంది ?
చెప్పు కరోనా అనే నేను ధైర్యంగా అడుగుతున్నాను

ఎన్ని రాష్ట్రాలలో ప్రజలు చనిపోయారో తెలుసా నీకు ?
కన్న తల్లి బిడ్డ నుండి దూరమై పోతుంటే ఆ బాధ తెలుసా
కరోనా !
నువ్వు ఒక తల్లికి పుట్టి ఉంటే నీకు బాధ తెలిసేది
నీవు పుట్టలేదు కదా నిన్ను తయారు చేశారు
అందుకే ఇట్లా మనుషుల ప్రాణాలు తీస్తున్నావు
నువ్వు గాని మనిషిగా పుట్టి ఉంటే ఆ బాధలు తెలిసేవి

అందుకే నీకు భయపడి ప్రజలు బయటకు అడుగు
పెట్టడం లేదు
అదే నువ్వు మనుషుల్లా మారిపోవాలి అనుకుంటే
రాష్ట్రాలను వదిలిపెట్టి వెళ్ళిపో !
నేను చెబుతున్నాను .. నువ్వు ప్రజల్ని భయపెడితే
నేను నిన్ను భయ పెడతాను తెలుసుకో కరోనా ..
నేను నిన్ను ఏదో ఒకరోజు చంపుతాను కరోనా
నీవు ఎందరో ప్రాణాలు తీశావు
నీకు తెలుసా నీకు తెలియదు కదా
ఎందుకంటే నీవు ఒక వైరస్ లాంటిదానివి
అందుకని నీకు తెలియదు
మరి అదే నువ్వు నీ విశ్వరూపం చూపిస్తే
నేను నా విశ్వరూపం చూపిస్తాను

GENOMIC
DIAGNOSTICS NA
FDA EUA authorized COVID-19 Diagnostic Test Kits.
(973) 801-5800 www.GenomicsNA.com

# తెలవారలేదు

P.L.N. మంగారత్నం

జీవితంలో నెగిటివ్ ఆలోచన ఆరోగ్యానికి హాని చేస్తుందనీ, పాజిటివ్ దృక్పథం కలిగి ఉండడం మంచిదన్నది ఒక మంచి మాట. కానీ, ప్రస్తుతం కరోనా విపత్తు వేళ .. నెగిటివ్ అన్న మాటే సంతోషాన్నిస్తుందనీ పాజిటివ్ అనే మాట భయాన్ని కలిగిస్తుందన్నది జీవిత సత్యం. అందుకు ఇదే తార్కాణం.

★★★

ముందురోజు సాయంత్రం అనగా ..బయటకు వెళ్ళిన భర్త ఏ మధ్య రాత్రిలోనైనా, వస్తాడేమోనని ఎదురుతెన్నులు కాస్తూనే ఉంది కుమారి. శివరాత్రి రోజున జాగరణ చేసినట్లు .. రాత్రి నిలిచిపోయినట్లు అనిపించింది. తెల్లవారి తొలి పొద్దులో పొలాలకు వెళ్ళే వాళ్ళు వెళుతున్నారు.

వీధి వాకిట్లో నిలబడి కనిపించిన వాళ్ళకి విషయం చెబుతూ, భర్తను గురించి వాకబు చేస్తుంది.

పసితనం వీడని పదేళ్ళ కొడుకూ, ఎనిమిదేళ్ళ కూతురూ వీధి అరుగు మీదే కూర్చుని చూస్తున్నారు తండ్రి రాక కోసం అన్నట్లు.

" అయ్యో! ఎక్కడకు వెళ్ళాడు? వెళ్ళేటప్పుడు చెప్పి వెళ్ళొద్దూ ఇంట్లో. పిల్లలు ఎదురు చూస్తారని అనుకోలేదా? " ఇవే ప్రశ్నలు.

వాళ్ళతోపాటు ఉన్న వరహాలమ్మ మాత్రం " ఏవన్నా గొడవ పడ్డావేమో! మా అబ్బాయితో. అందుకే చెప్పకుండా ఎక్కడికో చెక్కేసి ఉంటాడు " అంది ఎగాదిగా చూస్తూ.

" అయ్యో! లేదు అత్తయ్యా! నాలుగురోజుల నుండీ జ్వరం వస్తుంటే, మందు బిళ్ళలు తెచ్చుకోవడానికని సెంటర్లోకి వెళ్ళారు. వచ్చిన .. రెండు నిముషాలకే మళ్ళీ బండి తీస్తుంటే .. ఇప్పుడేగా వచ్చింది మళ్ళీ, ఎక్కడికీ? అన్నా. ఏదో వినిపించీ, వినిపించకుండా అనేసి వెళ్ళిపోయారు. ఈయన ఎప్పుడు ఏ విషయం సరిగ్గా చెప్పారు గనుక .. అనుకుంటూ రాత్రంతా ఎదురు చూస్తూనే ఉన్నా" చెప్పింది.

" ఏమిటీ? నాలుగురోజుల నుండీ జ్వరం వస్తుందా? డాక్టరు చూపించుకున్నాడా? లేదా? అసలే రోజులు బాగా లేవు కూడాను" ఉన్న చోటనుండి కాస్త వెనక్కి తగ్గాడు .. అటుగా పొలానికి వెళ్ళబోతున్న రావు లచ్చన్న. అప్పటికే విషయం చుట్టుప్రక్కల తెలియడంతో అంతా గుమిగూడారు ఆ ఇంటి ముందు.కుమారి మధ్య మధ్యలో కళ్ళు వత్తుకుంటూనే, వచ్చిన వాళ్ళకు విషయం ఏకరువు పెడుతూంది. సైకిలు మీద అటుగా వస్తూ పోచయ్య కూడా ఓ నిముషం ఆగాడు.వాతావరణం బరువుగా ఉండడంతో 'ఏమిటన్నట్లు' కళ్ళతోనే ప్రశ్నించాడు.

" నిన్న సాయంత్రం అనగా బయటకు వెళ్ళిన నాంచారావు ఇంకా ఇంటికి రాలేదట" చెప్పింది వరుసకు అక్క అయ్యే కామాక్షి.

" రాత్రి నుంచి నాంచారావు ఇంటికి రాలేదా? ఎర్రరంగు బండి ఒకదాన్ని రావిచెట్టు దగ్గర ఉన్న కాలువగాట్టు మీద చూసానే .. ఇప్పుడు వస్తూ వస్తూ" చెప్పాడు పోచయ్య.

ఆమాటకి పోబోతున్న ఊపిరి తిరిగినట్లు అయ్యింది కుమారికి. తమది ఎర్రరంగులో ఉండే హీరో హోండా బండే.

" బాబ్బాబూ! ఒక్కసారి మా శంకరాన్ని నీ సైకిలు మీద ఒకసారి అక్కడికి తీసికెళ్ళవూ, నీకు పుణ్యముంటుంది. రాత్రి నుంచీ ఈ బాధ తట్టుకోలేకపోతున్నాను" అంటూ పోచయ్యని బ్రతిమాలుతూనే, కొడుకు శంకరం వైపు తిరిగి " ఒరేయ్! బాబాయితో వెళ్లి .. అది మన బండో! కాదో! చూడు. అది మనదే అయితే, అక్కడ మీ నాన్నకనిపిస్తే వెంటనే ఇంటికి రమ్మన్నానని చెప్పు" అంటూ పురమాయించింది.

వాళ్ళు అటు వెళ్ళగానే, హమ్మయ్యా! అన్నట్లు గుండెల నిండుగా ఊపిరి తీసుకుంది నవ్వు ముఖంతో. విషయం తేలిపోవడంతో " రానియ్యి. ఇంట్లో చెప్పకుండా ఎక్కడికి పోయాడో! అడుగుతాను. సంసారం అంటే, అల్లాటప్పా అనుకున్నాడేమో " అంటూ వరహాలమ్మ కూడా తన ఇంటివైపు దారి తీసింది.

★★★

పోచయ్య, శంకరాన్ని సైకిలు ఎక్కించుకుని కాలువగట్టు మీదకు పోనిచ్చాడు. రావిచెట్టు దగ్గర ఇందాక చూసిన బండి అక్కడే ఉంది. అంత ప్రొద్దుటే అటుగా వచ్చేవాళ్ళు ఎవరో గాని ఉండరు. చూడగానే అన్నాడు శంకరం "ఇది మాదే" అని. చుట్టుప్రక్కల చూసాడు, నాన్న కనిపించలేదు గానీ, నాన్న చెప్పులు మాత్రం కాలువ అంచుకి కనిపించాయి. అవి అక్కడ ఎందుకు వదిలాడో మాత్రం అర్ధం కాలేదు. ఎత్తైన కాలువ అంచున చెప్పులు కనబడితే, ఏమని అనుకోవాలి? అక్కడ పల్లంగా 'రేవు' అయినా లేదు. కాళ్ళు కడుక్కోవడం కోసం 'దిగాడు' అని అనుకోవడానికైనా.

శంకరం ఎలుగెత్తి పిలిచాడు " నాన్నా" అంటూ .. ప్రకృతి ప్రతిధ్వనించిందే గాని, పలుకులేదు.

విషయం తెలుసుకుని జనం పోగయ్యారు. కాస్సేపటికి శంకరాన్ని తీసుకుని వెనక్కి వచ్చేసాడు పోచయ్య. కొడుకు చెప్పిన మాటలకు గోడుగోడున ఏడ్చింది కుమారి. విషయం పోలీసు స్టేషనుకి తెలియ చేసింది. వాళ్లయినా మనిషిని వెతికి తెస్తారన్న ఆశతో.

★★★

అలాగే, వెతికి పట్టుకున్నారు.

ఆ మరునాటికి .. అదే కాలువలో శవమై తేలినప్పుడు. అర్ధాంతరంగా తనువు చాలించిన నాంచారావును చూసేందుకు జనాలు తండోపతండాలుగా వచ్చారు. కుమారిని పట్టుకోవడం ఎవరితరమూ కావడంలేదు. పొగిలి పొగిలి గుండెలు బాదుకుంటూ ఏడుస్తుంది.

పోస్టుమార్టానికి ముందు శవానికి 'కోవిడ్' పరీక్షలు జరిగాయి.

'పాజిటివ్' రిపోర్టు వచ్చింది. ఆ అనుమానంతోనే ప్రాణాలు తీసుకున్నాడని నిర్ధారణ అయ్యింది.

అంతే .. అప్పటివరకూ ఉన్న వాళ్ళు కనబడకుండా పోయారు. కడసారి చూపుకి నోచుకోకుండానే .. అటు నుంచి ఆటే, వెళ్ళిపోయాడు నాంచారావు. కడుపు కోత మిగిలింది కుటుంబానికి. కరోనాతో పోయినా, ఆత్మహత్య చేసుకున్నా చావు .. చావే. చావు భయంతో .. దానికి ఎదురెళ్ళడం కన్నా, వైద్యం చేయించుకుంటే ఎలా ఉండేదో పరిస్థితి. ఎంతమంది బాగై ఇంటికి వెళ్ళలేదు. అక్కడికీ చెప్పింది కుమారి " ఓసారి పెద్దాసుపత్రికి వెళ్లి చూపించుకో రాదూ .. జ్వరం పాటు, ఆయాసం కూడా వస్తుంది కదా" అని. " అమ్మో! రిపోర్టు తేడాగా వచ్చిందంటే .. ఇక అక్కడే ఉంచేస్తారు. ఆ నరకాన్ని నేను భరించలేను. వెళ్ళిన వాళ్ళు చెబుతున్నారు కదా! అక్కడ సౌకర్యాలు ఏవీ సరిగా లేవట. వెళ్ళిన తరువాత మనిషి బ్రతికి వస్తే అది వాడి అదృష్టం " అంటూ కొట్టిపారేశాడు. కొట్టిపారేసి చేసింది ఏమిటీ? బలవ్మరణం పొందాడు. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవడానికి అన్నట్లు అయ్యింది.

★★★

ఆ మరునాడే ఊరిలోకి వైద్య బృందం వచ్చింది నాంచారావు ఇల్లు వెతుక్కుంటూ. కుమారికీ, పిల్లాలకూ కోవిడ్ పరీక్షలు చేసారు. పంచాయతీ వాళ్ళు బ్లీచింగు చల్లి, చుట్టుప్రక్కల ప్రదేశాలు సానిటైజ్ చేసారు. పిల్లలకి నెగిటివ్ రాగా, కుమారికి మాత్రం 'పాజిటివ్' వచ్చింది. పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆమె మరింత భయపడింది. భర్తకు దగ్గరగా ఉండేది భార్యే కాబట్టి, తనకీ ముంచుకొచ్చింది. తనకీ భర్త గతే పడుతుందా? పిల్లలు ఏమవుతారు? భవిషత్తు అంతా చీకటిమయంగా, గాడాంధకారంలోకి నెట్టేసినట్లు అయ్యింది. అప్పుడే నిర్ణయించేసుకుంది. తను ఏ.ఎన్. ఏం చెప్పినట్లు, క్వారంటైనుకి వెళుతుంది. అదృష్టం బాగుంటే, పిల్లలకు తనైనా దక్కుతుంది. అల్లుడు పోయాడని తెలిసి .. వచ్చిన తల్లి సూర్యనారాయణమ్మ మాత్రం కూతురి దగ్గరే ఉండిపోయింది. ఇంకా 'దిన కార్యమైనా' కాకుండా కూతురిని వంటరిగా వదిలేయ్యకూడదని. ఇంట్లో తల్లి అయినా ఉందన్న నిశ్చింతతో .. అడుగు ముందుకు వేసింది కుమారి. సూర్యనారాయణమ్మ కూతుర్ని మళ్ళీ చూడగలనా! లేదా! అన్నట్లు కన్నీళ్ళు పెట్టుకుంది. పిల్లలూ అంతే, అలాగే ఏడ్చారు. కంటికి కనబడని భూతం తమని విడదీస్తున్నందుకు.

★★★

అంబులెన్సు ఊరి పెద్దాసుపత్రి ముందు కాకుండా, ఊరు చివరన చక్కటి హౌసింగు బోర్డు కాలనీ దగ్గర ఆగింది. దాన్ని తాత్కాలికంగా కోవిడ్ సెంటరుగా మార్చింది ప్రభుత్వం. ఆ వాతావారణంలోకి అడుగు పెట్టగానే దుఃఖం ఉపశమించినట్లయ్యింది. అక్కడ తనలాగే, వచ్చిన వాళ్ళు చాలామందే ఉన్నారు. ఆడవాళ్లకు వేరుగా .. మగవాళ్ళకు వేరుగా పడకలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. ఫ్లాటుకి ముగ్గురినీ, నలుగురినీ ఉంచుతున్నారు. కొత్త ఇళ్ళు .. కొత్త వాష్ రూమ్సు.. స్వంత ఇంటి కన్నా చాలా సౌకర్యవంతంగా ఉంది.

ఎవ్వరూ దుఖపడుతున్న దాఖలాలు లేవు. అందరూ ఇంట్లో అయిన వాళ్ళ మధ్య ఉంటున్నట్లే ఉన్నారు. తనతో పాటు గదిలో మరొకామె కూడా ఉంది. పేరు సుభద్రమ్మ, చాలా దూరం నుంచి వచ్చింది. ఆమెకీ, తనలాగే లక్షణాలు ఏమీ పైకి కనిపించకపోయినా కరోనా వచ్చింది.

ఆమెతో స్నేహం కుమారికి ఊరట నిచ్చింది.

" బాధ పడకులేమ్మా. నా ఇంట్లో రెండు చావులు చూసాను, వారం రోజుల తేడాతో .. నా భర్తా, పదేళ్ళ కొడుకూను. నీకు పిల్లలన్నా ఉన్నారు. నాకు అదీ లేదు. ఎవరి కోసం బ్రతకాలో తెలీదు. ఈ రోగం ఇప్పట్లో భూమి మీద నుంచి పోయేలా లేదు. మనమే ధైర్యంగా ఉండాలి. పోయిన వాళ్లతో మనమూ పోలేము కదా" అంటూ ఓదార్చింది కన్నీళ్ళు పెట్టుకుంటూ. అంత బాధలోనూ 'అయ్యో! పాపం' అనుకుంది .. ఆమె పరిస్థితి తలచుకుంటూ. అందరివీ ఇలాంటి గాధలే. హాయిగా ఉన్న సంసారాలు ఒక్కసారిగా కుప్పకూలుతున్నాయి. ఉండే సెంటరు చుట్టూ పంటపొలాలు, వాటి వెనుకగా కొబ్బరి తోటలు. కళ్ళ ముందు చిత్రం మారిపోయే సరికి కుమారి కూడా కోలుకుంటుంది. డాక్టర్ల మాటలు ఆమెలో ధైర్యాన్నినింపాయి. పిల్లలు తరచూ ఫోన్లో మాట్లాడుతున్నారు. మందులతో పాటు, బలమైన ఆహారం కూడా రోజూ పెడుతున్నారు. కాబట్టి, తను రోగాన్ని జయించి తన పిల్లల్ని చేరుకుంటుంది. వచ్చిన కొత్తలో జబ్బు వలన కలిగిన భయం కంటే, ఆసుపత్రిలో ఎలా చూస్తారో అన్న భయమే ఎక్కువ బాధించేది. ఇప్పుడది లేదు. అంతా వసుధైక కుటుంబంలా మాస్కులూ, సామాజిక దూరంతో అందరూ సరదాగానే ఉన్నారు. ముందుగా వచ్చిన వాళ్ళు బాగై, వెళ్ళిపోతూ, ఆత్మీయుల నుండి వీడ్కోలు తీసుకుంటున్నట్లు అందరకీ చెప్పి మరీ వెళుతున్నారు. కుమారీ అలాంటి ఆశతోనే ఉంది. ఆశే మనిషిని బ్రతికిస్తుందన్నట్లు .. అలాగే, జరిగింది. క్వారంటైన్ సమయం ముగిసి మళ్ళీ పరీక్షలు చేయించుకుంటే ఈసారి 'నెగిటివ్' రిపోర్టు. ఆ సాయంత్రం చెప్పాడు డాక్టరు.

" రేపు ఉదయాన్నే నిన్ను డిశ్చార్జ్ చేస్తున్నామమ్మా. అయినా ఓ పదిరోజుల పాటు ఎవ్వరితోనూ కలవకుండా, మందులు వాడుతూ .. జాగ్రత్తగా ఉండాలి " అని.

ఆ మాటకి భర్త కళ్ళ ముందు మెదిలినట్లయి కన్నీరు తిరిగింది. జలజలా రెండు కన్నీటి చుక్కలు రాలి పడ్డాయి. తనకు తానుగా అన్యాయం అయిపోయాడని.

" ఆ అధైర్యమే వద్దు. నీ ఆత్మ విశ్వాసమే నీకు రక్ష. పిల్లల మీద ఆశే నిన్ను కోలుకునేలా చేసింది " మళ్ళీ ధైర్యం చెప్పాడు డాక్టరు. అప్పుడు నవ్వింది ఆమె. ఆ కన్నీళ్ళు ఆనందభాష్పాలు అయ్యేలా. మళ్ళీ పునర్జన్మ ఎత్తినట్లుయి .. బ్రతుకు ఆశలు రేపుతుంటే .. ఆరాత్రి ఎంతకీ తెల్లవారలేదు కుమారికి.

# ఘుండెల్లో తడి

జడా సుబ్బారావు

"ఇక్కడే దొరికిద్దంటావా?" అంది రత్తమ్మ.

రత్తమ్మ ప్రశ్నలో ఆందోళన కంటే ఆతృత వినిపించి ఆమె వంక ఆశ్చర్యంగా చూసిన కాంతమ్మ "బిడ్డో, గొడ్డో బయటపడితే గానీ చెప్పలేం. చంపేసి ఇక్కడే పడేసుంటారు" అంది కాంతమ్మ.

"ఏమో పాపం... నిన్న మద్దేనం నుంచీ కబురు తెలవలేదు. బతికున్నాడో లేడో తెలియదు, చెర్లోనే వున్నాడో, ఎక్కడికన్నా ఎల్లేడో తెలియదు" అంది రత్తమ్మ.

"ఈడితో పనిచేసే పిల్లల్ని పట్టుకుంటే ఇవరం తెలిసేది" అంది కాంతమ్మ.

"మనిశి పోయాక అట్టా పోయాడు, ఇట్టా పోయాడు అని చెప్పుకుంటే మాత్రం తిరిగొత్తాడా? ఆయిగా రిచ్చా తొక్కుకుంటా బతికేవాడు. సుకాన వున్న పేనాన్ని దుక్కాన పడేసుకున్నట్టుగా, ఈ మాయదారి రోగానికి బయపడి బేరాలు రాక చెరువుల దగ్గర కాపలాకి కుదురుకున్నాడు. పేనాలు తీసుకుంటానికే ఇంతదూరం వచ్చాడేమో... మాయదారి కాలం ఇట్టా దాపురించింది" మెటికలు విరిచింది రత్తమ్మ. మూడెకరాల చెరువుగట్టు చుట్టూ ఊరంతా చేరింది. ఇంటివాళ్లంతా ఏ వార్త వినవలసి వస్తుందోనని భయంభయంగా చెరువు వైపు చూడసాగారు. 'బతికుంటే చాలు' అన్నట్టుగా కళ్లల్లో నీళ్ళు నింపుకుని తమలో తాము కుమిలిపోసాగారు.

అంటుకోవాలో లేదో తెలియని అయోమయంతో ఆడవాళ్లంతా చీరకొంగులు నోటికి అడ్డం పెట్టుకునే 'ఆడికేమీ కాదులే... మీరు ఏడవబాకండి' అంటూ వాళ్లకు ధైర్యం చెప్తూ ఓదార్చుతున్నారు.

పొరుగూరి నుంచి వచ్చిన గజ ఈతగాళ్లు మనిషిలోతున్న చెరువులో దిగి గాలింపు చేపట్టారు. తల్లుల కొంగుచుట్టూ తిరుగుతున్న పిల్లలకు నీళ్లల్లో ఈదుతున్న గజ ఈతగాళ్లను చూస్తుంటే సరదాగా ఉంది. వాళ్లవంక చూస్తూ చప్పట్లు కొడుతున్నారు. నిశ్చలంగా ఉన్న నీళ్లల్లో పెద్ద బండరాయి వేసినట్లుగా గజ ఈతగాళ్ళు నలుగురూ నాలుగువైపులా నీళ్లను చెదరగొడుతూ వెతుకుతున్నారు.

నిముషాలు గంటలుగా దొర్లిపోతున్నాయి.

సూర్యుడు నిప్పులకుండను నెత్తిమీద పెట్టుకుని ఆకాశమంతా తిరుగుతున్నట్లుగా ఎండ మిటమిట లాడుతోంది. ఒక్కొక్కరి ఒళ్ళూ ఆవిరియంత్రంలా మారిపోయింది. పీల్చేగాలిని, వదిలేగాలిని భరించలేక మాస్కులు పక్కకి తొలగించి మళ్లీ పెట్టుకుంటూ అస్సుస్సులంటూ నిట్టూర్చుతున్నారు జనాలంతా!

"ఇదిగో ఇక్కడేదో జుట్టులాగా కనబడతంది... చూడండి.." అన్నారెవరో గుంపులోనుంచి.

గట్టుగట్టుంతా తిరనాలలో తొక్కిసలాటలా మారిపోయింది.

అప్పటి వరకూ పాటించిన భౌతిక దూరమంతా ఒకరి ముందొకరిగా ఒదిగిపోయింది. తోసుకుంటున్నట్లు, నెట్టుకుంటున్నట్లుగా ఎవరికి వాళ్లు ముందు చూడాలన్న తహతహతో చెమట్లను, చిరాకును, ఎండనూ పక్కకి నెట్టి చెరువు వైపు తదేకంగా చూడసాగారు.

జుట్టులాగా కనిపిస్తున్న పీచును పైకి లేపి అందరికీ చూపించి అది శవం కాదని నిర్ధారించి మళ్ళీ ఊపిరి ఉగ్గబట్టుకుంటూ లోపలికి మునిగాడు గజ ఈతగాడు.

"హు..." అనే నిట్టూర్పులతో చెరువుగట్టంతా సముద్రపు హోరులా మారింది.

గంటలు దొర్లిపోతున్నాయి. నిల్చున్నవాళ్లలో అసహనం పెరిగిపోసాగింది. "సుబ్బి పెళ్ళి ఎంకి చావు కొచ్చినట్లు" తగుదునమ్మా అని వచ్చినందుకు తగినశాస్తి జరిగిందని కొంతమంది, ఇంటి దగ్గర నీడపట్టున ఉండక ఎండనబడి వచ్చినందుకు తిక్క కుదిరిందని కొంతమంది తమలో తామే గొణుక్కుంటూ విసుక్కుంటూ ఎవరి మానాన వాళ్ళు కదలని శవాల్లా నుంచున్నారు.

"ఇల్లెట్టా వుందో? తలుపుగడి కూడా సరిగా పెట్టకుండా ఎగేసుకునొచ్చాను. కుక్కలు ఇంట్లో దొరబడి అంతా ఆగమాగం చేత్తన్నయ్యో ఏంటో" అంది రత్తమ్మ.

నోటికి చీరచెంగు అడ్డం పెట్టుకుని ఫకాలుమని నవ్వుతూ 'కుంటోడు కూటికేడిత్తే, అవిటోడు ఆలికేడ్చా డని' వూరికే అన్నారా? ఎవుడి గోల ఆడిది..." అంది.

రత్తమ్మ కూడా ఆమె నవ్వుతో శృతి కలిపింది.

మధ్యాహ్నం మూడుగంటలు దాటింది.

'చచ్చినోడి కోసం రావడం మా చావుకొచ్చిందన్నట్లు'గా అసహనంగా చూడసాగారు అందరూ.

చెరువును జల్లెడ పడుతున్న గజ ఈతగాళ్ల నిరీక్షణ ఫలించింది. మూడు ఎకరాల చెరువుకి చివరగా నీళ్లల్లో కనిపించీ కనిపించకుండా ఉన్న దుంగకు పట్టుకుని కనిపించిన ఆకారాన్ని నలుగురూ కలిసి ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేయసాగారు.

"చూత్తారేమయ్యా... మీరు కూడా వొచ్చి సాయం పట్టండి" అంటున్న గజ ఈతగాళ్లను చూస్తూ, శవాన్ని చూడ్డం వరకే మా పని తప్ప సాయం చేయడం మా బాధ్యత కాదన్నట్లుగా శవానికి దగ్గర దగ్గరగా ఉన్నవాళ్లంతా దూరం దూరంగా జరగసాగారు.

రోజురోజంతా నీళ్లల్లో నాని, ఉబ్బి, చూడ్డానికి ఎబ్బెట్టుగా, పట్టుకోవడానికి వీల్లేకుండా ఉన్న శవాన్ని చూస్తూ ముక్కులు మరింత గట్టిగా మూసుకోసాగారు అక్కడి వాళ్లంతా. కాసేపు అక్కడి గాలి మొత్తం దుర్గంధంతో నిండిపోయింది. 'వచ్చిన పని అయిందన్నట్లు'గా కొంతమంది అక్కడినుంచి జారుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వెళ్ళేవాళ్ళను చూస్తూ కాసేపు నుంచుని తర్వాత మిగిలిన వాళ్ళు కూడా జారుకోసాగారు.

ఎవరో నలుగురు ఊరోళ్ళు, ఇంటివాళ్లు, గజ ఈతగాళ్లు తప్ప దాదాపు చెరువుగట్టంతా ఖాళీ అయి పోయింది. కొంతసేపటి క్రితం నేల ఈనిందేమో అన్నట్లుగా ఉన్న చెరువుగట్టు తుఫాను తర్వాత తుడిచిపెట్టుకు పోయిన ఊరిలా మారిపోయింది.

గట్టునున్న చెట్టుకింద శవాన్ని దించి "అమ్మా మా డబ్బులిత్తే ఎల్లిపోతాం" అన్నారు గజ ఈతగాళ్ళు.

దుఃఖాన్ని పమిటకొంగులో అదిమిపెట్టుకుని తలెత్తి వాళ్ల వంక చూసింది రాజమ్మ. వాళ్లల్లో ఏ భావమూ లేదు, ఒళ్లంతా తడిసిపోయి, చెరువంతా గాలించడం వల్ల అలసిపోయినట్లుగా కనిపించారు. "బాబూ... అసలే ఆయన పోయిన బాదలో వున్నాను. ఎట్టాగూ ఎతికి ఒడ్డుకు శేర్చారు. కాత్త ఇంటిదాకా సాయం పట్టండి బాబూ.. అక్కడిత్తాను డబ్బులు" అంది రాజమ్మ.

ఆమె వంక విచిత్రంగా చూశారు గజ ఈతగాళ్ళు. కాసేపయ్యాక "చూడమ్మా... ఎతికే వరకే మా పని. రిచ్చా మాట్టాడుకుని ఇక్కడున్న పెద్దోల్ల సాయంతో ఇంటికి తీసుకెల్లండి" అన్నారు ముక్తకంఠంతో.

'రిక్షా' మాట వినబడగానే రాజమ్మ దుఃఖం కట్టలు తెంచుకుంది. ఉప్పెన వచ్చి ఊరిమీద పడ్డట్టుగా దుఃఖంతో ఆమె శరీరం వణికిపోసాగింది. ఆమెవంక దీనంగా చూస్తున్నారు తప్ప ఏమీ మాట్లాడకుండా ఉన్నారు గజ ఈతగాళ్ళు. అక్కడున్న పెద్దవాళ్ళు కలగజేసుకుని వాళ్లకి డబ్బులిచ్చి పంపించేశారు.

శవాన్ని ఇంటికి చేర్చి వాకిట్లో వేసిన మంచంమీద పడుకోబెట్టారు. మంచానికి దగ్గరగా కూర్చుని గుండెలు పగిలేలా ఏడవసాగింది రాజమ్మ. పక్క ఇళ్ల ఆడవాళ్లంతా దూరంగా నిలబడి చూస్తున్నారే గానీ దగ్గరకెళ్ళి ఓదార్చే ప్రయత్నం ఎవరూ చేయట్లేదు. చిన్నపిల్లలిద్దరూ తల్లిచుట్టూ చేరి గడ్డకట్టుకుపోయి తల్లిని చూస్తున్నారు.

వాకిట్లో శవం దగ్గర ఎవరూ లేరు. వీధి అరుగుల మీద అక్కడ-క్కడా కొద్దిమంది ఆడవాళ్ళు దూర దూరంగా కుర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. చావుబతుకుల ఊసు తెలియని చిన్నపిల్లలంతా సైకిల్ తొక్కుకుంటూ, టైరుతో ఆడుకుంటూ హడావిడి చేస్తున్నారు.

"ఒకరోజంతా నీల్లల్లో వుంది. ఎక్కువసేపుంటే పాడైపోద్ది. గొయ్యి తవ్వడం అయిందంట. జరగాల్సిన పని తొందరగా కానియ్యండి" అంది అరుగుమీద కూర్చున్న ముసలావిడ.

తలెత్తి వీధివైపు చూసింది రాజమ్మ. ఒక్క మగమనిషి కూడా కనిపించలేదు. మనసేదో కీడు శంకించింది పైకిలేచి వీధిలోకి నడిచి ఒక్కో ఇంటిముందు నుంచునీ "అన్నయ్యా రండయ్యా" అని పిలవసాగింది. రెండు మూడు ఇళ్ల ముందు నిల్చుని పిల్చాక ఒక పెద్దమనిషి బయటికొచ్చి "చూడమ్మా... ఇద్దరు శిన్నబిడ్డలున్న ఆడకూతురువి, నీకింత కట్టం కలగడం బాదగానే వుంది. ఇప్పటికే వూరినిండా కరోనా కేసులున్నాయి. ఎవర్ని అంటుకుంటే ఎవరికొత్తందో తెలియక అయోమయంగా వుంది. ఇందాక శెరువునుంచి శవాన్ని ఇంటికి తెచ్చేటప్పుడే బరించలేని వాసనతో శానా ఇబ్బంది పడ్డాం. మళ్లీ శ్మశానం దాకా మోసుకుని రాలేం.. మీ పుట్టింటోల్లో శుట్టాలో వొత్తే ఆల్లతో కానిచ్చెయ్యి... ఇట్టా శెప్తున్నానని యేమీ అనుకోకమ్మాయ్.. మాకూ పెల్లాం పిల్లలున్నారు" అన్నాడు సమాధానం కోసం ఎదురుచూడకుండా.

గుండెలు పగిలిపోయాయి రాజమ్మకి.

పెడబొబ్బలు పెట్టుకుంటూ పరిగెత్తుకుని వచ్చి శవం మీదపడి భోరున ఏడవసాగింది. చూసేవాళ్ళు చూస్తున్నారుగానీ ఎవ్వరూ దగ్గరికొచ్చి ఓదార్చే ప్రయత్నం చేయట్లేదు.

కాసేపయ్యాక నెమ్మదిగా పైకిలేచింది.

భర్త తొక్కే రిక్షాను మంచానికి దగ్గరగా తీసుకొచ్చింది.

కడుపునిండా పాలు తాగి పొత్తిళ్లల్లో ఆదమరచి నిద్రపోతున్న పసిపిల్లాడిలా కనిపిస్తున్న భర్తను చూసి పొగిలిపొగిలి ఏడ్చింది. శరీరాన్ని అడుగున, పైన కప్పి ఉన్న దుప్పటితో పాటే చుట్టింది. వీపుకిందా, కాళ్ళకిందా రెండు చేతులేసి అమాంతం లేపి రిక్షాలో పడుకో బెట్టింది.

చిన్నపిల్లలిద్దరూ వెనకనుంచి రిక్షాను తోస్తుండగా రాజమ్మ ముందుకు నడిచింది. గాలి బరువుగా మారిపోయింది.

'బొట్టు, గాజులు, పూలు తీయకుండా శవాన్ని ఇట్టా తీసికెల్తే వూరికి అరిట్టం' అన్నారెవరో వెనకనుంచి. అలా అన్నవాళ్లెవరూ ముందుకు రాలేదు.

'మొగోల్లంతా బొట్టెట్టుకుని, గాజులేసుకుని ఇంటో కూసుంటే అరిట్టం కాదా' అంటోంది మరొకావిడ.

'కానికాలంలో వానొచ్చినా కట్టమే, సావొచ్చినా కట్టమే' మాటలు వినబడుతూనే ఉన్నాయి. మనిషి చచ్చిపోయాడో, మానవత్వం చచ్చిపోయిందో...

గుండెల్లోని తడి కళ్ళగుండా ప్రవహించి ఆమె దేహాన్ని ముంచెత్తింది.






Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

2016 DIVERSITY JOURNAL DIVERSITY LEADER AWARD | BEST PLACES TO WORK 2017 for LGBT Equality 100% CORPORATE EQUALITY INDEX | training TOP 125

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

NEW YORK LIFE